## ఎడిటర్ వ్యూ

# కుంగుబాటుకు వ్యాయామ కళ్లెం!

కుంగుబాటు (డిప్రెషన్), వ్యాయామం ఒకదాన్ని మరోటి ప్రోత్సహిస్తుంటాయి. కుంగుబాటుతో వ్యాయామం మీద ఆసక్తి తగ్గుతుంది. తగినంత శారీరక శ్రమ లేకపోతే కుంగుబాటు మరింత తీవ్రమవుతుంది. అందుకే డిప్రెషన్‌తో బాధపడేవారికి వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. దీంతో, ముఖ్యంగా బరువులెత్తే వ్యాయామాలతో మందులు, చికిత్సలతో సమానమైన ఫలితాలు కనిపిస్తున్నట్టు తాజాగా తేలింది. యూనివర్సిటీ ఆఫ్ లాంకషైర్ పరిశోధకులు 70కి పైగా ప్రయోగ పరీక్షలను సమీక్షించి ఈ విషయాన్ని గుర్తించారు. మానసిక స్థితి (మూడ్) మీద శారీరక శ్రమ గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్న విషయాన్ని ఇది మరింత బలపరచింది. వ్యాయామం, శారీరక శ్రమలు కుంగుబాటుతో ముడిపడిన వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్)ను తగ్గిస్తాయి. జీవ గడియారాన్ని తిరిగి సరిచేసి నిద్ర బాగా పట్టేలా చేస్తాయి. నాడీ కణాల వృద్ధికి తోడ్పడే బ్రెయిన్ డిరైవ్డ్ న్యూరోట్రోఫిక్ ఫ్యాక్టర్ విడుదలనూ ప్రేరేపిస్తాయి. ఈ ఫ్యాక్టర్ మూడ్ నియంత్రణకు దోహదం చేయటం గమనార్హం. అందువల్ల కుంగుబాటు బాధితులు వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయొద్దని పరిశోధకులు సూచిస్తున్నారు. చికిత్స ప్రణాళికల్లో దీన్ని విధిగా చేర్చాలని చెబుతున్నారు. ఈ సమీక్ష కోసం పరిగణనలోకి తీసుకున్న అధ్యయనాలు కొన్ని పాఠాలనూ నేర్పుతున్నాయి.

**1. ఒక చికిత్స సరిపోదు**

కుంగుబాటు మనిషిని చాలా తీవ్రంగా ఇబ్బంది పెడుతుంది. జీవితంలో తృప్తిని ఘోరంగా దెబ్బతీస్తుంది. ఇలాంటి తీవ్ర సమస్యకు ఒక చికిత్స సరిపోదు. సైకోథెరపీ, యాంటీడిప్రెసెంట్ మందులకు వ్యాయామాన్ని జోడిస్తే మంచి ఫలితాలు కనిపిస్తున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అందుకే మందులు వేసుకుంటున్నా, వేసుకోకపోతున్నా సైకాలజిస్టును సంప్రదించటం, వ్యాయామం చేయటం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

**2. ఎంత శ్రమకు అంత ఫలితం**

వ్యాయామం చేస్తేనే సరిపోదు, ఎంత తీవ్రంగా చేస్తున్నామన్నదీ ముఖ్యమే. మామూలు వ్యాయామం కన్నా తీవ్రమైన వ్యాయామంతో ఎక్కువ ఫలితాలు కనిపిస్తున్నాయి. శరీరాన్ని 10 నుంచి 20 నిమిషాలు ఒకింత ఎక్కువ శ్రమకు గురిచేసినా చాలు. తీవ్రమైన వ్యాయామంటే మరీ కష్టమని అనుకోవాల్సిన పనిలేదు. పక్కవారితో మాట్లాడటం కష్టంగా అనిపిస్తే తీవ్రంగా చేస్తున్నట్టే లెక్క. ఇది ఆయా వ్యక్తుల శరీర సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది.

**3. వ్యాయామం ఏదైనా**

నడక, నెమ్మదిగా పరుగెత్తటం, యోగా, బరువులు ఎత్తటం.. ఇలా ఏ రకం వ్యాయామమైనా కుంగుబాటు చికిత్సకు తోడ్పడుతుంది. రెండు, మూడు వారాలుగా కుంగుబాటుతో బాధపడేవారికి డ్యాన్స్ చాలా మేలు చేస్తున్నట్టు కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ వీటిల్లో కొద్దిమందిని.. అదీ యువతులను పరిగణనలోకి తీసుకోవటం వల్ల అందరికీ వర్తింపజేయటం తగదని పరిశోధకులు భావిస్తున్నారు. బరువులెత్తటం, సైకిల్ తొక్కటం ఆడవారికి బాగా ఉపయోగపడుతుంటే.. యోగా, థాయ్ చీ మగవారికి మరింత మేలు చేస్తున్నట్టు కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. వృద్ధులకు యోగాతో, చిన్నవయసువారికి బరువులెత్తటంతో ప్రయోజనం కనిపిస్తోంది. యోగా, బరువులు ఎత్తటాన్ని మానకుండా కొనసాగిస్తున్నట్టూ బయటపడింది.

**4. తోడుగా చేస్తే**

ఐకమత్యం బలమనే సూత్రం వ్యాయామానికీ వర్తిస్తుంది. ఒంటరిగా కన్నా నలుగురితో కలిసి వ్యాయామాలు చేస్తే కుంగుబాటు లక్షణాలు మరింతగా తగ్గుతుండటం గమనార్హం. కుంగుబాటులో ఒంటరిగా ఉండిపోవటం పెద్ద లక్షణం. నలుగురితో కలిసి వ్యాయామం చేస్తే ఒంటరితనం దూరమవుతుంది. ఇతరుల కన్నా మరింత కఠినంగా చేయాలనే కోరికా కలుగుతుంది. కాబట్టి వీలుంటే జిమ్‌లో చేరి శిక్షకుల సమక్షంలో లేదా బృందంగా వ్యాయామం చేయటం మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

**5. నైపుణ్యం సాధిస్తే**

వ్యాయామాల్లో నైపుణ్యం సాధించటమూ దిగులు, నిరాశ ఎక్కువగా తగ్గటానికి తోడ్పడుతుంది. ఒకింత ఎక్కువ బరువు ఎత్తటం.. కాస్త ఎక్కువ దూరం, ఎక్కువసేపు పరుగెత్తటం కూడా నైపుణ్యం కిందికే వస్తాయి. కుంగుబాటు ఎప్పుడూ గొప్ప పనులు చేయలేవని మనిషిని వెనక్కి లాగుతుంటుంది. దీంతో చాలామంది అక్కడే ఆగిపోతుంటారు. వ్యాయామం దాన్ని అబద్ధమని నిరూపిస్తుంది. మారటం సాధ్యమేనని, కొత్త అలవాట్లు నేర్చుకోవచ్చని, మెరుగ్గా పనులు సాధించొచ్చని నేర్పిస్తుంది. ఇది నిజంగా ఒక శక్తిమంతమైన ఔషధమే. పరుగు, బరువులెత్తటం శరీరానికి పరీక్ష పెట్టి, పురోగతి సాధించేలా చేస్తాయి. యోగా, థాయ్ చీ వంటివి ఏకాగ్రత, జాగరూకత ద్వారా నైపుణ్యం పెంపొందిస్తాయి.

**6. ఫలితాలు నెమ్మదిగా**

వ్యాయామ ఫలితం కనిపించటానికి కొంత సమయం పడుతుంది. కౌన్సెలింగ్, యాంటీడిప్రెసెంట్ మందుల విషయంలో డాక్టర్లు ఎవరికి ఏది పడుతుందో, ఎంత మోతాదు సరిపోతుందో తెలుసుకోవటానికి సమయం పడుతుంది. మరోవైపు వ్యాయామానికి శారీరక, ఆర్థిక, సామాజిక, మానసిక పరిమితులు అడ్డుతగులుతుంటాయి. ఎవరికేది నప్పుతుందో, ఆనందంగా చేయగలిగిన వ్యాయామాలేంటో గుర్తించటానికి కాస్త సమయం అవసరం. అప్పుడే మధ్యలో మానెయ్యకుండా ఉండటం సాధ్యమవుతుంది. క్రమం తప్పకుండా చేస్తుంటే నెమ్మదిగా ఫలితాలు కనిపించటం మొదలవుతుంది.

# కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్ సర్కార్‌కు పడుతుంది..

- మొదటి పేజి తరువాయి

క్యాంపు ఆఫీసుపై దాడి చేయడం కాంగ్రెస్ సర్కార్ అరాచక పాలనకు అద్దం పడుతోందన్నారు. ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తున్న బీజేపీ నేతలకు సమాధానం చెప్పడం చేతకాని కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగడం, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచామని విర్రవీగుతున్న కాంగ్రెస్ సర్కారుకు దమ్ముంటే మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించాలని సవాల్ ?విసిరారు. నేడు జరిగే మంత్రి వర్గ సమావేశంలో ఎన్నికలపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజనుకు ఇవ్వాల్సిన రైతు భరోసా డబ్బులు జమ చేయాలని, గతంలో ఇవ్వకుండా ఉన్న పెండింగులో ఉన్న బకాయిలను కూడా చెల్లించాలి. ప్రతి కేబినెట్?సమావేశంలో బడా కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లులు, వాటి కమిషన్లలో వాటాలు, పంపకాల గురించి తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించడంపై చర్చించకపోవడం దుర్మార్గమన్నారు.

**రిజర్వ్ బ్యాంకు నుంచి రూ.9 వేల కోట్ల అప్పు**

ఈ నెల 10వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు నుంచి రూ.9 వేల కోట్ల అప్పు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందని అన్నారు. ఆ డబ్బు రైతు భరోసా కోసమే అని అన్నదాతలు భావించారని, కానీ డబ్బులు వచ్చి పది రోజులు దాటిన రైతు భరోసా చెల్లించకపోవడంతో ఈ డబ్బులను కూడా బడా కాంట్రాక్టర్లకే బిల్లుల చెల్లించడంలో భాగంగా ఇచ్చారనే అనుమానం కలుగుతోందన్నారు. ఇటీవల క్యాబినెట్ మంత్రులంతా ఢిల్లీకి వెళ్లినపుడు కాంగ్రెస్ హైకమాండ్ తెలంగాణ పొటెన్షియల్ స్టేట్, ఫండింగ్ చేయాలని కోరినట్టు తెలిసింది. అందుకే కాంగ్రెస్ హైకమాండ్‌కు కప్పం కట్టేందుకు రిజర్వ్ బ్యాంకు నుంచి తాజాగా అప్పు తీసుకున్న తొమ్మిది వేల కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించి, వారిచ్చే కమిషన్లను హైకమాండ్?కు పంపుతున్నట్టుగా ఉందన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షభంలో కూరుకుపోతుందని కాగ్ వంటి సంస్థలు, ఆర్థిక నిపుణులు హెచ్చరించిన రేవంత్ సర్కార్ బారెడంత అప్పులు చేస్తోందని, బెత్తెడంత అభివృద్ధి, సంక్షేమం చేయకపోవడం దారుణం అని మండిపడ్డారు.

# రెండేండ్లలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం. తెలంగాణలోని ప్రతీ ఎకరాకు నీరందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**బీఆర్ఎస్ నేతలకు సవాల్..**

ఇప్పుడు మళ్లీ సవాల్ చేస్తున్నాను. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వారేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశారో సభలోనే చర్చిద్దాం. ఎవరేం చేశారో నిండు సభలో ప్రజలకు వివరిద్దాం. విమర్శలు, ప్రతి విమర్శలు వద్దు అనుకున్నా ఓకే. పదేళ్ల అనుభవంతో వాళ్లు సలహాలు, సూచనలు చేస్తే స్వీకరిస్తాం. అంతిమంగా అందరం కలిసి రాష్ట్రానికి మేలు చేసేలా కృషి చేద్దాం. ఎన్నికలప్పుడు

మాత్రమే రాజకీయాలు చేద్దాం. ప్రజలు, తెలంగాణ నీళ్ల విషయంలో అందరం కలిసిగట్టుగా ఉందాం. కృష్ణా జలాల విషయంలో తాము ఏపీకి సహకరిస్తున్నామనేది పచ్చి అబద్ధం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇచ్చారు.

# కేసీఆర్ కంటే.. రేవంత్ రెడ్డే వెరీ డేంజరస్

- మొదటి పేజి తరువాయి

పాలన నడుస్తోందని విమర్శించారు. హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేపై దాడి జరిగి రెండ్రోజులు అవుతున్నా.. ఇప్పటివరకు స్పీకర్ ఆరా తీయకపోవడం దారుణమన్నారు. కేవలం 15 శాతం ఓట్ల కోసం ఎంఐఎంకు కాంగ్రెస్ నేతలు మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కంటే.. రేవంత్ రెడ్డి వెరీ డేంజరస్ సీఎం అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు కూడా పేర్లు మార్చుకోవాలని హితవు పలికారు. శ్రీధర్ బాబు.. శ్రీధర్ బాబాగా, భట్టి విక్రమార్క భట్టి అక్రమ్‌గా మార్చుకోవాలని సూచించారు.

**అక్కడే రాజీనామా చేస్తా..**

అంతకుముందు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. కామారెడ్డిలో శనివారం జరిగింది ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందన్నారు. తనను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారని, రేపటి నుంచే గ్రామాల్లోకి వెళ్తా ఎలా అడ్డుకుంటారో చూస్తానన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇక్కడ పోటీ చేసి ఓడిపోయినప్పటికీ అభివృద్ధి విషయంలో ఆయనకు స్వాగతం పలుకుతానన్నారు. కాలేజీ భూముల విషయంలో తనపై చేసిన ఆరోపణలను నిరూపించడానికి కాంగ్రెస్ నాయకులు రావాలని, సోమవారం నేనే కలెక్టరేట్‌కు వస్తానన్నారు. అక్కడ కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్‌లు కూడా ఉంటారన్నారు. వారి సమక్షంలోనే ఆధారాలను తీసుకువచ్చి నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానన్నారు.

# మన టెక్నాలజీ చూసి ప్రపంచ దేశాలు ఆశ్చర్యపోయాయి

- మొదటి పేజి తరువాయి

'ఏఐ'ని ఉపయోగించడం, భారత పురాతన గ్రంథాలు, జ్ఞానాన్ని సంరక్షించడానికి ఏఐను ఉపయోగించడం చూసి ప్రపంచ నేతలు ప్రశంసించారని అన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్ రంగాలకు చెందిన వారు ఈ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిశోధన, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ సహా అభివృద్ధి చెందుతోన్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగిస్తూ భారత్ వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. మన యువత ఆవిష్కరణలతో దేశ కీర్తిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే శక్తిని కలిగి ఉందని అన్నారు. ఈ సదస్సు ద్వారా మన యువత ప్రతిభను ప్రపంచానికి చూపించగలిగామని అన్నారు.

**సైబర్ నేరాలపై హెచ్చరిక**

సైబర్ నేరాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. డిజిటల్ అరెస్టుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.కాగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కేరళకు చెందిన 10 నెలల చిన్నారి అలిన్ షెరిన్ అవయవదానానికి ముందుకు వచ్చిన తల్లిదండ్రులను ప్రధాని మోదీ ప్రశంసించారు. బిడ్డను కోల్పోయిన బాధలోనూ వారు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. వారి నిర్ణయం నలుగురికి జీవనదాతగా మారిందని పేర్కొన్నారు.

# దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# కృష్ణా, గోదావరి జలాల్లో ఒక్క చుక్క వదులుకోం

- మొదటి పేజి తరువాయి

దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తామని.. 5 లక్షల పైచిలుకు ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. రెండేళ్లలో గోదావరి నది బేసిన్?లో ఉన్న అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. గోదావరి బేసిన్?లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంటలు పండాయని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ 2026, జూన్ 2వరకు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

# హార్వర్డ్ నుంచి సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

- మొదటి పేజి తరువాయి

ఏఐ విస్తరణకు అవసరమైన నైపుణ్యాల కల్పన వంటి అంశాలపై ఈ సెషన్‌లో చర్చిస్తారు. భారత్ ఫ్యూచర్ సిటీ చొరవలో భాగంగా తెలంగాణలో 'ఏఐ సిటీ' నిర్మించాలన్న ప్రభుత్వ దార్శనికత, నాయకత్వానికి ఈ ఆహ్వానం ఒక గుర్తింపు అని సీఎంఓ పేర్కొంది. ఏఐ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో భూ కేటాయింపులు, విద్యుత్ మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడుల భాగస్వామ్యం వంటి అంశాల్లో రేవంత్ రెడ్డి పాలనా అనుభవం ప్రపంచ విధాన రూపకర్తలకు, పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల ఆధారిత అభివృద్ధిలో తెలంగాణ నాయకత్వానికి పెరుగుతున్న అంతర్జాతీయ గుర్తింపునకు ఈ ఆహ్వానం నిదర్శనమని చెప్పవచ్చు. ఇటీవల ముఖ్యమంత్రి అమెరికాలో పర్యటించినప్పుడు ఈ సింపోజియం నిర్వాహకులు ఆయనతో సమావేశమై ఈ కార్యక్రమం గురించి చర్చించారు.

## మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

సెక్రటరీగా ఉండగా, రాజిరెడ్డి పొలిట్ బ్యూరో మెంబర్‌గా ఉన్నారు. రెండు రోజుల్లో వారిని మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు.

వీరితో పాటు మరో 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దేవ్‌జీ అలియాస్ తిరుపతి తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందినవాడు. వీరంతా తెలంగాణ ఎస్ఐబీ ఎదుట సరెండర్ అయ్యారు. నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్ తర్వాత సెక్రటరీగా దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి మావోయిస్టు పార్టీకి సారథ్యం వహిస్తున్నారు.

# రాబోయే 24 గంటల్లో అల్పపీడనం

- మొదటి పేజి తరువాయి

లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అటు తెలంగాణలోని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఆకాశం మేఘావృతమై చెదురుమదురు వానలు పడుతున్నట్లు సమాచారం అందుతోంది.అల్పపీడన ద్రోణి కారణంగా రాబోయే 24 గంటల్లో మరిన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ (×వీణ) ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా కోస్తాంధ్ర, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ అకాల వర్షాల వల్ల కోతకు సిద్ధంగా ఉన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## బీజేపీకి కొత్త అర్థం చెప్పిన షర్మిల... చంద్రబాబు, జగన్ పై తీవ్ర విమర్శలు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీఎం చంద్రబాబు, వైసీపీ అధినేత జగన్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వారిద్దరూ ప్రధాని నరేంద్ర మోదీకి ప్రచారకర్తలుగా, బీజేపీ ఎదుట బానిసలుగా మారారని, స్వప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టే తోలుబొమ్మలని ఆమె తీవ్రంగా విమర్శించారు. చంద్రబాబుది బీజేపీతో అధికారిక పొత్తు అయితే, జగన్‌ది అక్రమ పొత్తు అంటూ ట్వీట్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అంటే బాబు-జగన్-పవన్ అని, వీరంతా మోదీ కోసం పనిచేస్తున్నారని షర్మిల ఆరోపించారు.ఈ సందర్భంగా షర్మిల స్పందిస్తూ... "ఏఐ సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఒక చైనా రోబో బొమ్మను ప్రదర్శించి 70 దేశాల ముందు దేశ ప్రతిష్ఠను దిగజార్చారు. భారతీయ ప్రతిభను తొక్కిపెట్టి చైనా ఉత్పత్తులను చూపించి దేశానికి అవమానం తలపెట్టినప్పుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడి నోళ్లు ఎందుకు పెగల్లేదు? అప్పుడు వారికి సిగ్గుగా అనిపించలేదా? కాంగ్రెస్ నిరసనలు తెలిపినప్పుడు మాత్రం వారి నోర్లు పెగిలాయి" అని వ్యాఖ్యానించారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, బాధ్యత గురించి బాబు, ఐక్యత గురించి జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ దేశం కోసం పోరాడుతుంటే మద్దతివ్వాల్సింది పోయి, అధికార పక్షానికి వంత పాడటం సిగ్గుచేటన్నారు. "ట్రంప్ పర్యటన సందర్భంగా అమెరికా ప్రయోజనాల కోసం సున్నా సుంకాలకు ఒప్పుకొని భారత రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు. ఇది రైతాంగానికి మరణశాసనం లాంటి బ్లాక్ డీల్ అని, దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని చెబుతూ ఇండియన్ యూత్ కాంగ్రెస్ నిరసన తెలిపింది.



బౌరంపేట్ వ్యాసా పాఠశాల..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# హెచ్ఎండిఏ కన్జర్వేషన్ జోన్‌లో..!
# 'దొడ్డిదారి' పర్మిషన్‌లా..?

- 2031 వరకూ 'నో బిల్డింగ్' జోన్‌గా ప్రకటించిన హెచ్ఎండిఏ..!
- 2026 ఫిబ్రవరి 20న కూడా కన్జర్వేషన్ జోన్ గానే సర్వే నెం.524,525,567 భూమి..
- అర్ధాంతరంగా 'సింగిల్ విండో' పేరుతో పర్మిషన్ ఎలా సాధ్యమైంది..?



-4లో

**మాధవ్ పత్తి..**
**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 22:**

'నిబంధనలకు విరుద్ధంగా' దుండిగల్ సర్కిల్ పరిధిలో, కన్జర్వేషన్ జోన్ మార్చకుండానే హెచ్ఎండిఏ అనుమతులు మంజూరు చేస్తోందా..? అనే ప్రశ్నకు, అవుననే సమాధానం వస్తోంది.. హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్--2031 ప్రకారం కన్జర్వేషన్ యూజ్ జోన్‌గా గుర్తించిన భూమిలో..! దుండిగల్ సర్కిల్ బౌరంపేట్‌లో వ్యాసా విద్యాసంస్థ (స్కూల్) నిర్మాణానికి బిల్డింగ్ పర్మిషన్ జారీ చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది.. ప్రభుత్వ రికార్డులే పరస్పర విరుద్ధంగా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది.. ఒకే స్థలం..! ఒకటే ప్రభుత్వ శాఖ..! రెండు విభిన్న ప్రభుత్వ పత్రాలు..! “”ల్యాండ్ యూజ్ ఇన్‌ఫర్‌మేషన్” (టిజి-బిపాస్) ప్రకారం.. బౌరంపేట్ సర్వే నెంబర్లు: 524, 525, 567 కన్జర్వేషన్ యూజ్ జోన్‌గా హెచ్ఎండిఏ అధికారికంగా 06-03-2025 తేదీన- 20- 02-2026 తేదీన (రెండు రోజుల క్రితం) జారీ చేసిన పత్రంలోనూ “కన్జర్వేషన్ జోన్”గానే ఉన్నట్టు స్పష్టంగా పేర్కొంది.. కానీ ఇదే భూమిపై “18-09-2025” తేదీన దుండిగల్ సర్కిల్ (మునిసిపాలిటీగా ఉన్నప్పుడే) గ్రౌండ్ ఫ్లోర్ + ఫస్ట్ ఫ్లోర్ స్కూల్ భవన నిర్మాణానికి 11,229.82 చ.మీ. విస్తీర్ణంలో బిల్డింగ్ పర్మిట్ మంజూరు చేసింది..”హెచ్ఎండిఏ” రిఫరెన్స్‌తో ఇస్తున్నట్టు, పర్మిషన్‌లో పేర్కొంది.. కన్జర్వేషన్ జోన్‌లో నిర్మాణాలే నిషేధం కదా..? అనుమతులు ఎలా సాధ్యం..? అన్న ప్రశ్నలు తలెత్తాయి.. హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్, G.O.Ms. No.288 (2008), వీణా-2031 ప్రకారం “కన్జర్వేషన్ యూజ్ జోన్”లో 'నివాస-వాణిజ్య- విద్యా సంస్థల' వంటి భవన నిర్మాణాలకు అనుమతి లేదని స్పష్టంగా పేర్కొన్నాయి.. మరోవైపు బిల్డింగ్ పర్మిట్‌లో ఒక కీలక క్లాజ్‌ను చేర్చుతూ 'రద్దు' హెచ్చరిక జారీచేశారు..! భవిష్యత్తులో తప్పుడు పత్రాలుగా తేలితే హెచ్ఎండిఏ యాక్ట్- 2008 సెక్షన్ 22 ప్రకారం, నిర్మాణ అనుమతి, దానంతటదే రద్దు అవుతుందని” అనుమతి పత్రంలో పొందుపరిచారు.. ఈ అనుమతుల జారీ వెనుకి బాగా పలుకుబడి పనిచేసినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..


- పలుకుబడి”కి తలవంచే ప్రభుత్వ శాఖలు..! కన్జర్వేషన్ జోన్‌గా ప్రకటించడం దేనికి..?
- అక్రమాలను సక్రమం చేసేందుకే ప్రభుత్వ అధికారుల విధులా..?
- కార్పొరేట్ విద్యాసంస్థలకు ఎందుకంత ప్రాధాన్యత..? ముడుపులేనా..?
- హెచ్ఎండిఏ నిబంధనలు ఉల్లంఘించి.. సింగిల్ విండో పర్మిషన్‌లు ఇవ్వడం ఏంటి..?
- సామాన్యులకో చట్టం..! బడా బాబులకో చట్టమా..?
- అదే బౌరంపేట్ గ్రామంలో ఏళ్ళ తరబడి రైతులు కన్జర్వేషన్ జోన్‌ల ఇబ్బందులు..
- వాళ్ళకు కూడా ఇదే ప్రకారం నిర్మాణ అనుమతులు ఇవ్వగలరా..?
- మాస్టర్ ప్లాన్‌లో 2031 వరకు కన్జర్వేషన్ జోన్‌గా ప్రకటించిన హెచ్ఎండిఏ..!
- అర్ధాంతరంగా 2025 లోనే హెచ్ఎండిఏ నిబంధనలు ఉల్లంఘించడంలో ఆంతర్యం.?
- మూడేళ్ళుగా కన్జర్వేషన్ జోన్‌లోనే..! వక్రమార్గంలో వ్యాసా పాఠశాల నిర్వహణ..
- 2022 మార్చి 5-7 తేదీ- 2025 మార్చి 6న, 2026 ఫిబ్రవరి 20న, కన్జర్వేషన్ జోన్‌గానే..
- 2025 సెప్టెంబర్ 18న (మూడేళ్ళకు) నిర్మాణ అనుమతులు జారీచేసిన వైనం..
- దుండిగల్ సర్కిల్ అధికారులు మొదట పర్మిషన్ గోప్యంగా పెట్టేందుకు యత్నం..!

- దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో మూడేళ్ళుగా అధికారుల లీలలు..!
- బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 కన్జర్వేషన్ జోన్‌లో 'వ్యాసా' పాఠశాల..
- ”మంత్రులు-ముఖ్యమంత్రుల” పలుకుబడి ఉంటే..! నిబంధనలు హుష్ కాకేనా..?
- టిజి-బిపాస్- “సింగిల్ విండో” పర్మిషన్‌లు.. హెచ్ఎండిఏ నిబంధనలు ఉల్లంఘిస్తాయా..?
- మూడేళ్ళుగా ఈ పర్మిషన్‌లు ఎందుకు ఇవ్వలేదు..? ఇప్పుడెలా సాధ్యమైంది..?
- సింగిల్ విండో అనుమతుల ప్రక్రియ 2025 లోనే అమలు చేశారా..?


బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 కన్జర్వేషన్ జోన్‌లో వ్యాసా పాఠశాల నిర్మాణాలు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రూ. 70 వేల కోట్లకు పైగా విలువైన.. 1,350 ఎకరాల భూముల్ని కాపాడినం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇప్పటివరకు సుమారు 1,350 ఎకరాల భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. స్వాధీనం చేసిన భూముల విలువ రూ. 70 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. హైడ్రా స్వాధీనం చేసుకున్న భూములను దశలవారీగా ప్రజా వినియోగానికి అందిస్తున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న భూములపై ఉన్న కోర్టు కేసులను చట్టపరంగా ఎదుర్కొని, కోర్టు క్లియరెన్స్ వచ్చిన తరువాతే ప్రజా వినియోగానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. కొండాపూర్ రాజేశ్వరి కాలనీలో కబ్జాదారుల నుంచి కాపాడిన 6 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ప్రభుత్వ విద్యా సంస్థలు, పార్కులు నిర్మించేలా ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు . ప్రభుత్వ భూములు, పార్కులు, ఓపెన్ స్పేస్ లను ఆక్రమణల నుంచి హైడ్రా కాపాడుతోంది. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి కాలనీలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని పార్క్, విద్యా సంస్థల స్థాపనకే వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థలు, పార్క్ ల అభివృద్ధికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో సీఎంసీ కమిషనర్ సృజన, విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి పరిశీలించారు.

# మల్లంపేట్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన..

- వైభవంగా శ్రీ శ్రీ విజయ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన..
- ముఖ్య అతిథిగా హాజరై బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు..

-4 లో



# హెచ్ఎండిఏ కన్జర్వేషన్ జోన్‌లో..! 'దొడ్డిదారి' పర్మిషన్‌లా..?

HYDERABAD METROPOLITAN DEVELOPMENT AUTHORITY
District Commercial Complex, Tarnaka, Hyderabad
LAND USE INFORMATION

Letter No : 052500/LU/P5/HMDA/16022022 Date : 07 March, 2022

To,
SRI SRI VAGDEVI EDUCATIONAL SOCIETY
FLAT NO.11,COONOOR TOWER,HILL COUNTRY,RAJEEVGANDI NAGAR,BACHUPALLY,MEDCHAL-MALKAJGIRI DIST,T.S.
500090

Sir / Madam,

Sub:-HMDA - Furnishing of Land Use Information.
Ref:-Your application No. **052500/LU/P5/HMDA/16022022**,dated: **16 February, 2022.**

With reference to your application cited, the details of Land Use Information as per statutory provisions of Extensive Modification to the Master Plan of HUDA AREA (excluding the erstwhile MCH area and the newly extended area of Huda) notified by the Govt. Vide G.O.Ms.No.288, MA dt:3.04.2008 is furnished hereunder:

| Survey No. | Land Use |
|---|---|
| 567 | : Conservation Use Zone. |
| VILLAGE | : Bowrampet |
| MANDAL | : Dundigal/Gandimaisamma |
| ZONE SEGMENT | : Medchal-Malkajgiri |
| DISTRICT | : Zone-1 Medchal |

NOTE:
1. This information does not bar any public agency or department including the HMDA from acquisition of Lands for Public purpose or from converting the Land Use at any time as per the Law.
2. This information shall not be used as the proof of any title to the Land.
3. This information shall not be used as the sole reason for obtaining exemption from the provisions of U.L.C.Act.1976.
4. This information does not provide any development permission under the APUA (Dev) Act.1975./HMDA Act 2008
5. Land use information does not guarantee that any Lay-Out or Building permission will be granted by competent authority. Any Building/Lay-Out permission will have to examined and granted by competent authority based on Building/Lay-Out/Land use Rules and conditions.
6. This letter is solely for information purpose only.
7. The Land Use Certificate is given on the Basis of Cadastral data shown in MDP-2031
8. The Water bodies shall also be read as per revenue records.

Application No.: 052500/LU/P5/HMDA/16022022 Page 1 of 2

Yours faithfully,

Name : D RADHA BAI
Designation : Junior Planning Officer
Junior Planning officer , HMDA
Date : 07-Mar-2022 12:09:55

Copy to:
Copy to the Special Officer, ULC, Hyderabad for kind information.
Copy to the Collector for kind information.

**2022 లోనూ హెచ్ఎండిఏ ల్యాండ్ యూజ్ ఇన్ఫర్మేషన్‌లో కన్జర్వేషన్ జోన్‌గానే..**

OFFICE OF THE DUNDIGAL MUNICIPALITY BuildNow
BUILDING PERMIT ORDER

| | |
|---|---|
| To, Smt BATTULA SIVA PADMAVATHI AND OTHERS LEASE HOLDER SRI. K. VENKAT RAM REDDY OWNER | File No: 003165/HMDA/00910/SWBP/MDL1/2025 |
| W/o SRI BATTULA PRASAD | Permit No: 0620/HMDA/SWBP/2025 |
| Address: FLAT NO.11C, COONOOR TOWER, HILL COUNTY, RAJEEV GANDHI NAGAR, BACHUPALLY VILLAGE AND MANDAL, UNDER NIZAMPET MUNICIPAL CORPORATION, MEDCHAL - MALKAJGIRI DISTRICT.T.S. | Date: 18/09/2025 |
| Pin code: 500090 | |

Dear Sir/Madam,

Sub: **Dundigal Municipality** - Town Planning Section - Proposal for **Educational/institutional Building Permission - Ground Floor + 1 Floor** to an extent of **11229.82 Sq. Mt.** in Plot No. , Survey.No. **524/PART 525/PART AND 567** of Locality - , **Bowrampet** Village, **Dundigal Gandimaisamma** Mandal, **Medchal - Malkajgiri** District - Permission Issued - Reg.

Ref: 1. Your Building Application in File No. **003165/HMDA/00910/SWBP/MDL1/2025**, dt: **24/06/2025**
2. G.O.Ms.No.168 M.A., dt. 07-04-2012 and its time to time amendments.

Your application submitted in the reference 1st cited has been examined with reference to the rules and regulations in force and permission is hereby sanctioned conditionally as detailed below:

A. APPLICANT AND LICENSED PERSONNEL DETAILS

| | | | |
|---|---|---|---|
| Name of Applicant | Smt BATTULA SIVA PADMAVATHI AND OTHERS LEASE HOLDER SRI. K. VENKAT RAM REDDY OWNER | | |
| W/o | SRI BATTULA PRASAD | | |
| Developer/Builder | | Lic. No | |
| Licensed Technical Person | MR. SANTHOSH KUMAR ADDEPALLI | Lic. No | CA/2018/99916 |
| Structural Engineer | | Lic. No | |
| Architect | MR. SANTHOSH KUMAR ADDEPALLI | Lic. No | CA/2018/99916 |

B. SITE DETAILS

| | |
|---|---|
| T.S. No./Survey No./Gramkhantam/Abadi | 524/PART 525/PART AND 567 |
| HouseNo/Door No/Pr.No/Plot No. | |
| Piece of land / Part of Survey Number | NA |
| Street / Road | |

**2026 ఫిబ్రవరి 20న హెచ్ఎండిఏ కన్జర్వేషన్ జోన్‌గానే ల్యాండ్ యూజ్ ఇన్ఫర్మేషన్..**

OFFICE OF THE DUNDIGAL MUNICIPALITY BuildNow
BUILDING PERMIT ORDER

| | |
|---|---|
| To, Smt BATTULA SIVA PADMAVATHI AND OTHERS LEASE HOLDER SRI. K. VENKAT RAM REDDY OWNER | File No: 003165/HMDA/00910/SWBP/MDL1/2025 |
| W/o SRI BATTULA PRASAD | Permit No: 0620/HMDA/SWBP/2025 |
| Address: FLAT NO.11C, COONOOR TOWER, HILL COUNTY, RAJEEV GANDHI NAGAR, BACHUPALLY VILLAGE AND MANDAL, UNDER NIZAMPET MUNICIPAL CORPORATION, MEDCHAL - MALKAJGIRI DISTRICT.T.S. | Date: 18/09/2025 |
| Pin code: 500090 | |

Dear Sir/Madam,

Sub: **Dundigal Municipality** - Town Planning Section - Proposal for **Educational/institutional Building Permission - Ground Floor + 1 Floor** to an extent of **11229.82 Sq. Mt.** in Plot No. , Survey.No. **524/PART 525/PART AND 567** of Locality - , **Bowrampet** Village, **Dundigal Gandimaisamma** Mandal, **Medchal - Malkajgiri** District - Permission Issued - Reg.

Ref: 1. Your Building Application in File No. **003165/HMDA/00910/SWBP/MDL1/2025**, dt: **24/06/2025**
2. G.O.Ms.No.168 M.A., dt. 07-04-2012 and its time to time amendments.

Your application submitted in the reference 1st cited has been examined with reference to the rules and regulations in force and permission is hereby sanctioned conditionally as detailed below:

A. APPLICANT AND LICENSED PERSONNEL DETAILS

| | | | |
|---|---|---|---|
| Name of Applicant | Smt BATTULA SIVA PADMAVATHI AND OTHERS LEASE HOLDER SRI. K. VENKAT RAM REDDY OWNER | | |
| W/o | SRI BATTULA PRASAD | | |
| Developer/Builder | | Lic. No | |
| Licensed Technical Person | MR. SANTHOSH KUMAR ADDEPALLI | Lic. No | CA/2018/99916 |
| Structural Engineer | | Lic. No | |
| Architect | MR. SANTHOSH KUMAR ADDEPALLI | Lic. No | CA/2018/99916 |

B. SITE DETAILS

| | |
|---|---|
| T.S. No./Survey No./Gramkhantam/Abadi | 524/PART 525/PART AND 567 |
| HouseNo/Door No/Pr.No/Plot No. | |
| Piece of land / Part of Survey Number | NA |
| Street / Road | |

**అదే కన్జర్వేషన్ జోన్‌లో 2025 సెప్టెంబర్ 18న సింగిల్ విండో బిల్డింగ్ పర్మిషన్..**



**హెచ్ఎండిఏ అనుమతులు మంజూరు చేయడమే కానీ పర్యవేక్షణ ఉండదు.. ఆ భాద్యత స్థానిక సర్కిల్ అధికారులదే..! ఈ మధ్యన లోకల్‌బాడీ పరిశీలన కూడా లేకుండా అన్నీ తానై, ముందూ వెనుకా చూసుకోకుండా గుడ్డిగా అనుమతులు జారిచేయడం 'హెచ్ఎండిఏ'కి కొత్తమేమి కాదు.. ఒక్క దుండిగల్ సర్కిల్ పరిధిలో హెచ్ఎండిఏ పర్మిషన్‌లతో చెరువులు, నాలాల కబ్జాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు లేకపోలేదు.. హెచ్ఎండిఏ తప్పుడు పర్మిషన్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌లు పొందడం అత్యంత సులభంగా ఉంటుందని సర్వత్రా ఆరోపణలు ఉన్నాయి.. అందులో బౌరంపేట్ వ్యాసా పాఠశాల నిర్వహకులకు రాజకీయ నేతలతో ఉన్న పలుకుబడి తోనే, ఈ అక్రమ పర్మిషన్ మంజూరు చేసినట్లు స్పష్టమవుతుంది.. మూడేళ్ళుగా అవకాశం లేని అనుమతులు ఇప్పుడు ఎలా సాధ్యమయ్యాయనే ప్రశ్నలకు సమాధానం ఉందా..?**

- 3 పేజి తరువాయి


ఒక కార్పొరేట్ విద్యాసంస్థకు సహకరించేందుకు 'అటు హెచ్ఎండిఏ– ఇటు దుండిగల్ సర్కిల్ 'సిఎంసి' (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) తీవ్ర కృషి చేస్తుంది.. అక్రమార్కులను సక్రమం చేసేందుకే అన్నట్టు, విధులు నిర్వర్తిస్తున్నారని, హెచ్ఎండిఏ జారీచేసిన అధికారిక పత్రాలతో స్పష్టమవుతుంది.. అధికారుల అవగాహనా వైఫల్యమా..? చట్టంలోని లోపాలు, అక్రమార్కులకు అనుకూలంగా మారాయా..? అన్నది ప్రశ్నగా మిగిలింది..! హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) మాస్టర్ ప్లాన్–2031 ప్రకారం కన్జర్వేషన్ యూజ్ జోన్‌గా ప్రకటించిన భూముల్లో నిర్మాణాలు పూర్తిగా నిషేధం. అయినప్పటికీ..! అదే జోన్‌లో "సింగిల్ విండో బిల్డింగ్ పర్మిషన్" పేరిట బిల్డింగ్ పర్మిట్‌లు జారీ కావడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది.. చట్టాలను దాటవేసేలా అనుమతులిచ్చారా..? అన్న అనుమానాలు బలపడుతున్నాయి..'హెచ్ఎండిఏ' అధికారిక "ల్యాండ్ యూజ్ ఇన్ఫర్మేషన్" రికార్డుల ప్రకారం బౌరంపేట్ గ్రామ పరిధిలోని పలు సర్వే నెంబర్లు ఇప్పటికీ కన్జర్వేషన్ జోన్‌గా, సుమారు 200 ఎకరాలకు పైచిలుకే ఉన్నాయి. ఈ జోన్ 2031 వరకూ చెల్లుబాటు అయ్యే స్టాట్యూటరీ మాస్టర్ ప్లాన్‌లో భాగం.. అలాంటి భూముల్లో నివాస, వాణిజ్య, విద్యా సంస్థల నిర్మాణాలకు ఎటువంటి అనుమతులూ ఇవ్వకూడదని 'హెచ్ఎండిఏ' నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.. "సింగిల్ విండో బిల్డింగ్ పర్మిషన్" అంటే చట్టాలపై అధికారం చెలాయిస్తుందా..? ఎస్.డబ్ల్యు.బి.పి అనేది కేవలం అనుమతులు మంజూరు జారీ విధానం మాత్రమే.. 'ల్యాండ్ యూజ్'ను మార్చే అధికారం 'హౌెద్రా'కి లేదనే స్పష్టత ఇస్తున్నాయి.. ఒకసారి మాస్టర్ ప్లాన్‌లో భూమి కన్జర్వేషన్ జోన్‌గా నమోదైతే, ఆ జోన్‌ను మార్చకుండా బిల్డింగ్ పర్మిట్ ఇవ్వడం చట్టవిరుద్ధమని పలువురు విమర్శలు చేస్తున్నారు.. అయితే ఈ వ్యవహారంలో "జోన్ కన్వర్షన్" లేదు..! "మాస్టర్ ప్లాన్ మార్పు నోటిఫికేషన్" లేదు..! "గెజిట్ ప్రకటన" లేదు..! ఒకవేళ కన్జర్వేషన్ జోన్ మార్చినట్లయితే, "2026 ఫిబ్రవరి 20న" హెచ్ఎండిఏ జారీచేసిన "ల్యాండ్ యూజ్ ఇన్ఫర్మేషన్" లోనూ కన్జర్వేషన్ జోన్‌గానే ఎలా ఇస్తారు..? అయినప్పటికీ బౌరంపేట్ వ్యాసా పాఠశాలకు ("సింగిల్ విండో బిల్డింగ్ పర్మిషన్") బిల్డింగ్ పర్మిట్ జారీ కావడం అనేక ప్రశ్నలకు దారి తీస్తోంది..















## నేను చూశాను అంతా సక్రమమే:ఏసిపి శ్రీనివాస్..

బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 భూమి హెచ్ఎండిఏ కన్జర్వేషన్ జోన్‌లోనే ఉన్నట్టు, 20-02-2026 తేదిన(రెండు రోజుల క్రితం) కూడా "ల్యాండ్ యూజ్ ఇన్ఫర్మేషన్" జారీ చేసినప్పటికీ..! దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ కార్పోరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారి అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి) శ్రీనివాస్‌తో అనుమతులు ఎలా మంజూరు చేశారని, ప్రస్తావించగా జోన్ మార్పిడితోనే అనుమతులు మంజూరు చేశామని, పొంతనలేని సమాధానం చెప్పడం అనుమానాలను రేకెత్తిస్తుంది.. తనే స్వయంగా చూశానని, అంతా సక్రమమే అంటూ, ఏసిపి శ్రీనివాస్ కితాబిచ్చారు.. సంబంధిత ఆధారాలు ఇవ్వగలరా అని ప్రశ్నించగా, అనుమతులు మంజూరు చేసిన, 'హెచ్ఎండిఏ' వద్ద అడగమని చెప్పడం గమనార్హం.. 2022 నుండి గత మూడేళ్ళుగా "వ్యాసా పాఠశాల" అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై, దుండిగల్ మున్సిపాలిటీగా ఉన్నప్పటికీ..! ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులు.. తీరా జీహెచ్ఎంసిలో విలీన ప్రక్రియతో 2025 సెప్టెంబర్ 18న అకస్మాత్తుగా అనుమతులు మంజూరు చేయడం వెనుక ఆంతర్యం..? మూడేళ్ళుగా పర్మిషన్ ఎందుకు ఇవ్వలేదు..? విలీన ప్రక్రియ మొదలవ్వగానే కన్జర్వేషన్ జోన్‌లో పర్మిషన్ ఇవ్వడానికి ప్రత్యేక చట్టాలు తెచ్చారా..? అనేక ప్రశ్నలు వస్తున్నాయి..

# మల్లంపేట్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన..

### వైభవంగా శ్రీ శ్రీ విజయ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన..

### ముఖ్య అతిథిగా హాజరై బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు..

**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 22:**మల్లంపేట్‌లో శ్రీ శ్రీ విజయ గణపతి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ సైబరాబాద్ కార్పోరేషన్ పరిధి మల్లంపేట్‌లోని భావన జిఎల్‌సి క్రిబ్స్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ విజయ గణపతి ఆలయ ప్రారంభోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిగింది.. ఈ కార్యక్రమానికి భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు..వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొని భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డిని శాలువతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో దేవాలయ నిర్మాణం ప్రజల ఐక్యతకు ప్రతీక, ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు సామాజిక విలువలను బలపరుస్తాయని పేర్కొన్నారు.. కార్యక్రమంలో మల్లంపేట్ మాజీ కౌన్సిలర్ హన్మంత్ రావ్, కాలనీ ప్రెసిడెంట్ వంశీకృష్ణ, కల్చరల్ హెడ్ సుబ్బారెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి సభ్యులు రామ నారాయణ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు..





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..


# కాంగ్రెస్‌లో చేరిన ఉద్యమ నాయకుడు..

## గుమ్మడి మధుసూదన్ రాజుకు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కండువా కప్పి ఆహ్వానం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 22:** తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన గుమ్మడి మధుసూదన్ రాజు (సుచిత్ర) ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షులు మహేష్ గౌడ్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పోరాడిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి బలాన్ని చేకూరుస్తుందని పేర్కొన్నారు.. గుమ్మడి మధుసూదన్ రాజు మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ లక్ష్యాలను సాధించే దిశగా
కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తోందని నమ్మకంతోనే పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ వేదికగా మరింత శక్తివంతంగా పోరాడతానని అన్నారు.. మహేష్ గౌడ్‌కు, కొలను హన్మంతరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు..



టీపీసీసీ మహేష్ గౌడ్‌తో, గుమ్మడి మధుసూదన రాజు..



## రామచందర్ రావు హౌస్ అరెస్టు అప్రజాస్వామికం: ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ పెన్ పవర్:** కామారెడ్డికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తన పార్టీ ఎమ్మెల్యేకు సంఘీభావం తెలపడానికి వెళ్లడం కూడా నేరమా అని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇదే తరహా హౌస్ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిందని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి అదే విధానాన్ని అనుసరిస్తున్నారని విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వమే ప్రతిపక్షాలపై ఆంక్షలు విధించడం సరికాదన్నారు. సంఘీభావం తెలపడానికి వెళ్తున్న బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులను హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఈటెల పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలే గుండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విధానం పై ప్రభుత్వం సిగ్గుపడాలని, ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

## కరీంనగర్ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొలగాని శ్రీనివాస్.. అభివృద్ధి పనుల ఫైలుపై తొలి సంతకం



**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ నగర మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ మధ్యాహ్నం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే మేయర్ శ్రీనివాస్ నగర అభివృద్ధిపై తనదైన ముద్ర వేస్తూ.. నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఫైలుపై ఆయన తొలి సంతకం చేశారు. కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, కొత్త అభివృద్ధి పనుల మంజూరుకు సంబంధించిన పత్రాలపై సంతకం చేసి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. అయితే, మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన కొలగాని శ్రీనివాస్‌కు కార్పొరేషన్ అధికారులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో కొలిగాని శ్రీనివాస్ అన్నారు.

## తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు అరెస్ట్ ని ఖండించిన కిషన్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు అరెస్ట్ ను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. కామారెడ్డిలో నెలకొన్న పరిస్థితులపై కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. కాంగ్రెస ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలు చేస్తోందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఇదిలా ఉంటే కామారెడ్డిలోని డిగ్రీ కాలేజీ స్థలం విషయంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య వివాదం మొదలైంది.మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక తరవాత నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఆయన తండ్రి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ భూములను అరోరా కాలేజీలకు కట్టబెట్టారని ఆరోపించారు. దీంతో ఆరోపణలను నిరూపించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆ పార్టీల నాయకులు సవాళు ,, ప్రతిసవాళ్లు విసురుకోవడంతో వివాదం మరింత పెద్దగా మారింది. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో బీజేపీ ఎమ్మెల్యేకు మద్దతుగా రాంచందర్ రావు బయలుదేరగా ఆయనతో పాటు రాష్ట్రంలోని పలువురు బీజేపీ ముఖ్యనాయకులను హౌస్ అరెస్ట్ చేశారు.

# రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు.. పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో రానున్న రెండు రోజుల పాటు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేస్తూ అప్రమత్తం చేసింది. నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం బలమైన అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో వాతావరణంలో కీలక మార్పులు చోటు చేసుకున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడన కేంద్రం నుండి మధ్య మహారాష్ట్ర వరకు ఒక ద్రోణి ఏర్పడి ఉంది. ఇది సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉంది.ఈ ద్రోణి ప్రధానంగా మధ్య తమిళనాడు, అంతర్గత కర్ణాటక మీదుగా దక్షిణ మధ్య మహారాష్ట్ర వరకు వ్యాపించి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల ప్రభావంతో ఈ అకాల వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ నిపుణులు తెలిపారు. దీనివల్ల సోమవారం, మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలో ఒకవైపు గరిష్ట ఉష్ణోగ్రతలు సైతం ఎక్కువగానే నమోదవుతున్నాయి. మార్చి నెల ప్రారంభం కాకముందే దాదాపు 35 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

**నేడు, రేపు వర్షాలు**

సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాలో కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్ జిల్లాలో కురిసే అవకాశం ఉంది.

# గురుకుల ప్రవేశాలకు ముగిసిన టీజీ సెట్-2026.. 94.93 శాతం హాజరు నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన టీజీ సెట్--2026 కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలోని 492 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించగా, మొత్తం 1,72,842 మంది విద్యార్థులు హాజరయ్యారని టీజీ సెట్--2026 చీఫ్ కన్వీనర్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ఎస్. కృష్ణ ఆదిత్య వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, టీజీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీఆర్ఈఐఎస్, ఎంపీజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్ సంస్థల పరిధిలోని గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకూ, అలాగే 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకూ ఈ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.మొత్తం 1,82,061 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, అందులో 1,72,842 మంది (94.93 శాతం) పరీక్షకు హాజరయ్యారని, 9,219 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఈ అధిక శాతం హాజరు గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశం పొందాలనే విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉన్న ఆసక్తిని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఎస్. కృష్ణ ఆదిత్య అన్నారు. పరీక్షను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా అధికారులు, పరీక్షా కేంద్రాల సిబ్బంది, పోలీసు శాఖకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఐసెట్ అభ్యర్థులకు టీశాట్ డిజిటల్ పాఠాలు..




**హైదరాబాద్ పెన్ పవర్:** పలు పోటీ పరీక్షలకు డిజిటల్ లెసన్స్ అందిస్తోన్న టీశాట్ నెట్వర్క్ తెలంగాణ ఐసెట్ 2026 పరీక్షలకు సైతం డిజిటల్ లెసన్స్ అందిస్తోందని సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే ఎంబిఎ, ఎంసిఎ అర్హత పరీక్ష ఐసెట్ కోసం ఫిబ్రవరి 23వ తేదీ సోమవారం నుండి ప్రసారాలు మొదలవుతాయన్నారు.తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2026 మే 13,14 వ తేదీన జరగనుండగా ఎనలిటిక్ ఎబిలిటీ, మ్యాథమెటిక్స్, కమ్యూనికేషన్ ఎబిలిటీ తదితర సబ్జెక్టులపై రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున ప్రసారం చేయనున్నామని, విద్యా ఛానల్ లో ఉదయం ఐదు నుండి ఆరు గంటల వరకు, నిపుణ ఛానల్ లో సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకు డిజిటల్ లెసన్స్ ప్రసారమవుతాయి సీఈవో వివరించారు. తెలంగాణాలోని విద్యార్థులు టీశాట్ డిజిటల్ లెసన్స్ సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

## కౌన్సిలర్ కిడ్నాప్ ఎపిసోడ్.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డికి పోలీసుల నోటీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆయన కుమారుడు ప్రశాంత్ రెడ్డి కి పోలీసులు నోటీసులు జారీ చేశారు. కౌన్సిలర్ యాదగిరి కిడ్నాప్ ఎపిసోడ్ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. అదేవిధంగా కిడ్నాప్‌కు గురైనట్లుగా భావిస్తున్న కౌన్సిలర్ యాదగిరికి కూడా పోలీసులు నోటీసులు పంపారు. అయితే, వారెవరూ ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో ఇబ్రహీంపట్న మండల పరిధిలోని ఎలిమినేడులో ఉన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి నివాసానికి నోటీసులు అంటించారు. ఇక హైదరాబాద్‌లోని నివాసానికి వెళ్లి నోటీసులను అందజేశారు.

**మూడు రోజుల గడువు..**

తాజాగా, జారీ చేసిన నోటీసులకు సంబంధించి మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆ నోటీసులలో పేర్కొన్నారు. కిడ్నాప్ కేసులో విచారణకు హాజరై తమ వివరణ ఇవ్వాలని స్పష్టం చేశారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా స్పందించని పక్షంలో బాధ్యులపై చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడికి ఒకేసారి నోటీసులు జారీ కావడంతో ఇబ్రహీంపట్నం పాలిటిక్స్‌లో ఉత్కంఠ నెలకొంది. ఈ కిడ్నాప్ వెనుక ఉన్న అసలు కారణాలు ఏంటో పోలీసుల విచారణలో బహిర్గతం కానుంది.

# రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుక రియల్ ఎస్టేట్ వ్యాపారమే.. హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు మధు పార్క్ రిడ్జ్ అపార్ట్ మెంట్‌వాసులు, మూసీ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంపీఆర్ అపార్ట్మెంట్స్ తో కేసీఆర్‌కు దగ్గరి సంబంధం ఉందని అన్నారు. ఈ అపార్ట్మెంట్ లకు కేసీఆర్ మంచినీళ్లు అందించారని చెప్పారు. కేసీఆర్ అపార్ట్మెంట్ లను నిలబెడితే రేవంత్ రెడ్డి కూల్చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మూసీ సుందరీకరణపై ఒక విధానం, ఒక పాలసీ లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే మూసీలోకి మురికినీరు రాకుండా రూ.4వేల కోట్లు ఖర్చు చేసి 38 ఎస్టీపీలు నిర్మించిందన్నారు. ఆరోజే కేసీఆర్ కాళేశ్వరం నుండి గోదావరి నీళ్లను తీసుకువచ్చి మూసీలో కలపాలని డీపీఆర్ తయారు చేశామన్నారు.

మూసీ అభివృద్ధిని తాము అడ్డుకోవడంలేదని, కానీ మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం వద్దన్నారు. పేదల ఇళ్లు కూలుస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుక రియల్ వ్యాపారం ఉంటుందన్నారు. రెండేళ్ల క్రితం సెంట్రల్ యూనివర్సిటీ భూములు లాక్కుంటానని చెప్పాడన్నారు. హిల్ట్ స్కామ్ పాలసీతోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనుకున్నాడని అన్నారు. ఫార్మాసిటీని ఫ్యూచర్ సిటీగామార్చి రియల్ వ్యాపారానికి తెరలేపారన్నారు. ఇప్పుడు మూసీ పేరుతోనూ అదే జరుగుతుందని విమర్శించారు. పథకాలకు డబ్బులు లేవనే రేవంత్ రెడ్డి అందాల పోటీసులు, మెస్సీని తీసుకువచ్చి ఫుట్ బాల్ ఆటలు ఎలా ఆడించాడని ప్రశ్నించారు.


# కేసీఆర్ ఆరోగ్యం కాపాడుకోండి..మార్నింగ్ వాకింగ్.. ఈవినింగ్ వ్యాయామం చేయండి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో 2034 వరకు ప్రజలు కాంగ్రెస్ నే ఆదరిస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఆరోగ్యం కాపాడుకోవాలన్న సీఎం రేవంత్..ఆయన ఆరోగ్యంపై పలు సలహాలు ఇచ్చారు . కేసీఆర్ ఉదయం వాకింగ్..సాయంత్రం వ్యాయామం చేయాలని సూచించారు. పిల్లిశాపనార్థాలతో ఉట్టి తెగదన్నారు. బీఆర్ఎస్ నేతలు ఇంకో పదేండ్లు ఆరోగ్యంగా ఉండాలి.. అందుకు పుస్తకాలు చదవాలి, ప్రవచనాలు వినాలని చెప్పారు. ఎంపీ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ప్రజల తీర్పు చూసైనా బీఆర్ఎస్ తీరు మారడం లేదన్నారు. కేసీఆర్,హరీశ్ రావు అసెంబ్లీకి వస్తే నది జలాలపై

చర్చిద్దామన్నారు రేవంత్. చౌకబారు ఆరోపణలతో తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీయొద్దని సూచించారు. పదేండ్లు అనుభవం ఉన్న కేసీఆర్, హరీశ్ సలహాలు, సూచనలు ఇస్తే పాటిస్తామన్నారు. తెలంగాణలో గెలిచి ఏపీకి ఎందుకు సహకరిస్తామని ప్రశ్నించారు. గోదావరిలో నీటి హక్కులను కాపాడుతామని..ఎవరూ టెన్షన్ పడొద్దని సూచించారు రేవంత్. సాగునీటి ప్రాజెక్టులు 70 శాతం పూర్తయినా నిధులు లేక ఆగాయన్నారు. చ్చే రెండేండ్లలో తుమ్మిడి హెట్టి నుంచి భద్రాచలం గోదావరి పరివాహక ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పారు రేవంత్.

## సిద్దిపేటలో ఉరేసుకున్న వైద్య విద్యార్థిని ..అసలేం జరిగింది.?



**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా అర్బన్ మండలం మిట్టపల్లిలో వైద్య విద్యార్థిని హత్మహత్య చేసుకుంది. పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం మెడిపెల్లి గ్రామానికి చెందిన శ్రీజ సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ఫిజియోథెరఫీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఫిబ్రవరి 22న హాస్టల్ లో ఎవరూ లేని సమయంలో శ్రీజ తన చున్నీతో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తోటి విద్యార్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హాస్టల్ కు వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి... విద్యార్థిని డెడ్ బాడీని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని మృతికి గల కారణాలపై ఆరాదీస్తున్నారు. తోటి విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నారు. విద్యార్థిని మృతికి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

## ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి పోలీసుల నోటీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి, ఆయన కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి ఇబ్రహీంపట్నం పోలీసులు నోటీసులు జారీ చేశారు. క్రైం నెంబర్ 119/2026 కింద దీఛీూ సెక్షన్ 35(3) ప్రకారం పోలీసులు నోటీసు జారీ చేశారు. కౌన్సిలర్ ఎన్నికల సర్టిఫికేట్, మొబైల్ ఫోన్ బలవంతంగా లాక్కొని, బాధితుడిని మూడు రోజుల పాటు నిర్బంధించారని ఆరోపణలు ఉన్నాయి.ఈ కేసులో పలు సెక్షన్ల కింద నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు బాధితుడి ఫోన్ వెంటనే తిరిగి ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకపోతే అరెస్ట్ చేసే అవకాశముందని పోలీసులు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఆయన కుమారుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసిన పోలీసులు

ఇంటికి తాళం ఉండడం వల్ల వారు అందుబాటులో లేకపోవడంతో, హైదరాబాద్ మలక్‌పేట్‌లోని తిరుమల హిల్స్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్లిన పోలీసులు నోటీసులు అతికించి, పలు సెక్షన్ల కింద ఇద్దరిపై కేసు నమోదు

## కొండాపూర్ లోని ఆ 6 ఎకరాల భూమి ప్రజాప్రయోజనాలకే: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి కాలనీలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని పార్క్, విద్యా సంస్థల స్థాపనకే వినియోగిస్తామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జీ సృజన స్పష్టం చేశారు. విద్యా సంస్థలు, పార్క్ ల అభివృద్ధికి కేటాయించిన భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో సీఎంసీ కమిషనర్ సృజన, విద్యాశాఖ కమిషనర్ నవీన్ నికోలస్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కలిసి పరిశీలించారు. ఆమోదిత లేఅవుట్ ప్రకారం 5 ఎకరాలు విద్యా సంస్థలకు, ఒక ఎకరం పార్క్ అభివృద్ధికి కేటాయించారు. అయితే లేఅవుట్, రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి పరిశీలించగా కొంతభాగం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అధికారుల ద్వారా భూమికి స్పష్టమైన డీమార్కేషన్ చేశారు. భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా సంబంధిత శాఖలతో ఫెన్సింగ్ పనుల ప్రారంభించారు. ఆరు ఎకరాల భూమిని ప్రజాప్రయోజనాలకే వినియోగిస్తామని స్థానికులకు అధికారులు భరోసా ఇచ్చారు. ఐదు ఎకరాల్లో విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖ కమిషనర్‌కు సీఎంసీ కమిషనర్ సూచించారు. ఒక ఎకరా పార్క్ స్థలాన్ని వెంటనే అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమీప మార్కెట్ ప్రాంతాల్లో సీఎంసీ కమిషనర్ సృజన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి వ్యాపారి తన దుకాణం వద్ద డస్ట్‌బిన్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త వేయరాదని హెచ్చరించారు. చెత్త సేకరణ సమయంలో ూాూ వాహనాలకు అప్పగించాలని సూచించారు. పారిశు ధ్య సిబ్బంది నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. రోడ్లపై చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షించాలని ఆదేశించారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు రావును పోలీసులు అరెస్ట్ చేశారు. కామారెడ్డి వెళ్లేందుకు బయలుదేరిన ఆయనను పర్మిషన్ లేదని పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో తార్నాకలోని ఆయన ఇంటివద్దకు భారీగా కార్యకర్తలు చేరుకోగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కామారెడ్డి వెళ్లి తీరుతానని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఈ క్రమంలో రాంచందర్ రావు, పలువురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు బీజేపీ ముఖ్యనాయకుల ఇళ్ల వద్ద పోలీసులు మోహరించారు.ఎవరూ కామారెడ్డి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఇదిలా ఉంటే కామారెడ్డిలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా వాతావరణం కనిపిస్తోంది. నేతలు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు. ఈ క్రమంలో బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి , కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీకి బహిరంగ సవాల్ చేశారు. కలెక్టరేట్ వద్ద అన్ని విషయాలు తేల్చుకుందామని అన్నారు. ఈ ఉద్రిక్తత నేపథ్యంలోనే రాంచందర్ రావు కామారెడ్డికి వెళ్లేందుకు ప్రయత్నించగా ఉదయం నుండి ఆయన ఇంటివద్ద పోలీసులు మోహరించి అరెస్ట్ చేశారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యం: డీసీసీ అధ్యక్షులకు మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన నాయకులు జిల్లాల్లో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలతో సన్నిహితంగా మమేకమవ్వాలని టీపీసీసీ చీఫ్?మహేష్?కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. సమన్వయం, క్రమశిక్షణ, సేవా భావంతో పని చేస్తే కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. వికారాబాద్ అనంతగిరిలో ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం రెండో రోజు కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. సంఘటన సృజన్ అభియాన్ కార్యక్రమం భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక శిక్షణా శిబిరం ద్వారా పార్టీ సంస్థాగత బలోపేతానికి, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధికి దిశానిర్దేశం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రాల వారీగా డీసీసీ అధ్యక్షులకు సమగ్ర అవగాహన కల్పిస్తూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై స్పందన విధానాలు, పార్టీ విధానాల అమలు, బూత్ స్థాయి బలోపేతం వంటి అంశాలపై విస్తృత చర్చలు నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, ఎన్నికల వ్యూహ రచన, సోషల్ మీడియా మరియు మీడియా నిర్వహణ, కార్యాచరణ ప్రణాళికలు వంటి కీలక అంశాలపై నిపుణుల ద్వారా డీసీసీ చీఫ్?లకు శిక్షణ అందించనున్నారు.

## శ్రీకృష్ణుడిగా నారసింహుడు..యాదగిరి గుట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇవాళ ఐదో రోజు ఉదయం స్వామివారి శ్రీకృష్ణావతార అలంకార సేవను ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలో అర్చకులు. యజ్ఞాచార్యులు, పారాయణికులు కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణుడిగా భక్తులను కనువిందు చేసిన నారసింహుడు... ఆలయ మాడవీధుల్లో విహరించి తన్మయపర్చారు. ప్రధానాలయంలో స్వామివారికి నిత్య ఆరాధనలు ముగిసిన అనంతరం ము రళీకృష్ణ అలంకారంలో ఆలయ తిరువీధు ల్లో ఊరేగించారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలతో శ్రీకృష్ణ అలంకారంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వజ్ర వైఢూర్యాలు ధరించి, మురళీని చేతబూని వేణుగానం ఆలపిస్తున్నట్లుగా స్వామివారిని చూడముచ్చటగా అలంకరిం చారు. యజ్ఞాచార్యుల వేదపఠనాలు, పారాయణికుల వేదపారాయణాలు, రుత్వికుల మూర్తిమంత్ర, మూలమంత్ర జపాల మధ్య శ్రీకృష్ణ అలంకార సేవను వైభవోపేతంగా నిర్వహించారు.

# హైదరాబాద్ లో ఫెరారీ బీభత్సకాండ..



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్ నెం.45 వద్ద వేగంగా ప్రయాణిస్తున్న ఫెరారీ కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లి, మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ ప్రభావంతో కారు రోడ్డుకు అవతలివైపు వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడంతో భారీ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఫెరారీ కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కార్లు ఒకదానికొకటి ఢీకొనడంతో మొత్తం మూడు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరికొన్ని ద్విచక్ర వాహనాలు కూడా ఈ ప్రమాదంలో నష్టపోయినట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే ఫెరారీ కారులో ఎయిర్‌బ్యాగులు ఓపెన్ కావడంతో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అయితే స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరోవైపు గాయపడిన పలువురిని స్థానికులు సమీప ఆసుపత్రులకు తరలించారు.ప్రమాద సమయంలో కారు అతివేగంతో నడిపినట్లు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. ప్రమాదం కారణంగా రోడ్ నెం.45లో భారీ ట్రాఫిక్ జాం ఏర్పడి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.ప్రమాదానికి గురైన ఫెరారీ కారు వెంకట రాజారెడ్డి పేరుతో రిజిస్టర్ అయి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ ఘటన మరోసారి నగరంలో అతివేగ డ్రైవింగ్ ప్రమాదకరమని గుర్తుచేసింది. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

# రామంతపూర్‌లో కలకలం.. పాచిపోయిన తందూరి రోటీలు..! బాధితురాలి ఆరోపణలు



**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలోని హోటళ్లలో నాణ్యత లేని ఆహారం వడ్డిస్తున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా రామంతపూర్‌లోని ఓ హోటల్ వేదికగా అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాచిపోయిన ఆహారాన్ని వడ్డించడమే కాకుండా, ప్రశ్నించినందుకు యజమాని దురుసుగా వ్యవహరించినట్లు బాధితులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే.. రోజా అనే కస్టమర్ సదరు హోటల్‌కు వెళ్లి తందూరి రోటీని ఆర్డర్ చేశారు. అయితే, ఆమెకు వడ్డించిన రోటీలు పాచిపోయి, దుర్వాసన వస్తుండటాన్ని గమనించిన ఆమె హోటల్ సిబ్బందిని నిలదీశారు.

**బాధితురాలి ఆరోపణలు..**

ఈ ఘటనపై బాధితురాలు రోజా ఆవేదన వ్యక్తం చేస్తూ పలు కీలక ఆరోపణలు చేశారు. పాచిపోయిన రోటీలను తిన్న కొద్దిసేపటికే తాను తీవ్ర అస్వస్థతకు గురైనట్లు ఆమె తెలిపారు. కేవలం రోటీలే కాకుండా, అక్కడ వడ్డించే బిర్యానీ కూడా నిల్వ ఉన్నదేనని ఆమె ఆరోపించారు. హోటల్ నిర్వాహకుల తీరుపై ఆమె నిలదీయడంతో అర్ధరాత్రి వరకు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఇలాంటి హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు (ఖీశీశీ ూఝటవ్‌ఎ ణవజూఖతీఎవత్) తక్షణమే స్పందించాలని బాధితురాలు డిమాండ్ చేశారు. హోటల్‌లో తనిఖీలు చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# మావోయిస్టు టాప్ కమాండర్ దేవ్‌జీ లొంగిపోయారు.. ధృవీకరించిన ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీ టాప్ కమాండర్, పార్టీ సెక్రెటరీ జనరల్ దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి తెలంగాణ పోలీసుల ఎదుట సరెండర్ అయినట్లు వార్తలు విస్తృతమైన విషయం తెలిసిందే. కేంద్ర కమిటీ సభ్యుడు రాజిరెడ్డి సహా 16మందితో కలిసి ఆయన తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు తెలుస్తోంది. తాజాగా ఈ పరిణామంపై ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్ శర్మ స్పందించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దశాబ్దాల కాలంగా మావోయిస్టు పార్టీ ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తున్న అగ్రనేత తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారని చెప్పారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో ఇది ఒక కీలక మైలురాయి అని ఆయన అభివర్ణించారు. నక్సలిజం అంతానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా రూపొందించిన జాతీయ స్థాయి వ్యూహమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ప్రభుత్వం భద్రతా బలగాలకు ఇచ్చిన పూర్తి స్వేచ్ఛ ఫలితంగానే సత్ఫలితాలు వస్తున్నాయని ఆయన చెప్పారు. నక్సలిజం ముగింపు దశకు చేరుకుంది. ఇప్పుడు కేవలం కొద్దిమంది అగ్రనేతలు మాత్రమే యాక్టీవ్‌గా ఉన్నారు. మిగిలిన వారితో కూడా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటాం అని విజయ్ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు.తెలంగాణలోకి జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ.. 1982లో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన తిరుపతి అప్పట్లోనే నక్సల్ ఉద్యమం కోసం అడవి బాట పట్టారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఏర్పాటు చేసిన తొలి దళానికి తిరుపతి కమాండర్‌గా పనిచేసినట్లు సమాచారం. తిరుపతికి దేవ్ జీతోపాటు అనేక మారుపేర్లతో పిలుస్తారు. సంజీవ్, చేతన్, సుదర్శన్, రమేష్ వంటి పేర్లతో తిరుపతి పనిచేశారు.

# సమ్మర్ వేళ గుడ్ న్యూస్.. ఇకనుంచి సత్వర విద్యుత్ సేవలు




**హైదరాబాద్ పెన్ పవర్:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ తన వినియోగదారులకు మరింత సమర్థవంతమైన, సులభమైన సేవలు అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. ఈ దిశగా వినియోగదారులు విద్యుత్ సేవలను నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారానే పొందేలా వాట్సాప్ చాట్‌బాట్ సేవలను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ వాట్సాప్‌లో 8712441912 నంబర్‌ను సేవ్ చేసుకుని Hi అని మెసేజ్ పంపడం ద్వారా ఫిర్యాదుల నమోదు, బిల్లింగ్ వివరాలు, విద్యుత్ సరఫరా స్థితి సమాచారం వంటి వివిధ సేవలను సులభంగా పొందవచ్చు. ఈ సేవ ద్వారా వినియోగదారులు ఎప్పుడైనా, ఎక్కడైనా విద్యుత్‌కు సంబంధించిన సమాచారాన్ని వేగంగా పొందగలుగుతారు. ప్రతి వినియోగదారుడు ఈ నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యుత్ సేవలను మరింత సులభంగా, సురక్షితంగా వినియోగించుకోవచ్చని సంస్థ పేర్కొంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# చిన్నారి మృతిపై సీపీఎం సంతాపం.. సీఎం రేవంత్ ఎదుట కీలక డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దైవదర్శనానికి వెళ్లిన రెండేళ్ల దళిత చిన్నారి అనుమానాస్పద మృతిపై సీపీఎం తెలంగాణ కార్యదర్శి జాన్ వెస్లీ(జ్ఞా×వీ జీశీష్ట్రఅ ఔవంశ్రీవఎ) స్పందించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 'చిన్నారి మృతి అత్యంత విషాదకరం. చిన్నారి మృతిపట్ల సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ఈ ఘటనపై స్పందించి చర్యలు తీసుకోవాలి. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి.

**విధుల్లోంచి తొలగించాలి..**

కుమ్మెర కొండపై ఉన్న ఆలయాన్ని కొందరు పెత్తందారులు తమ గుప్పిట్లో ఉంచుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతూ, ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. కుల వివక్షతో దాడులకు పాల్పడుతున్నారు. ఈ ఘటనలో చిన్నారి తల్లి కీర్తి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోకుండా, దాడి చేసిన పెత్తందారులు ఇచ్చిన ఫిర్యాదునే ముందుగా పరిగణనలోకి తీసుకోవడం వారి కుల వివక్షా పూరిత వైఖరిని స్పష్టం చేస్తోంది. చివరకు ప్రజాసంఘాల పోరాటం తర్వాత నిన్న సాయంత్రం కేసు నమోదు చేశారు. రాష్ట్రంలో మహిళలు, సామాజిక న్యాయం ప్రశ్నార్థకంగా మారాయనడానికి ఈ ఘటనే నిదర్శనం. బాధితుల ఫిర్యాదును నిర్లక్ష్యం చేసిన ఎస్ఐ మరియు ఇతర సిబ్బందిపై విచారణ జరిపి విధుల్లోంచి తొలగించాలని, తన తల్లి, తమ్ముడిని కొట్టిన నిందితుల నుండి బాధిత పోలీసు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చిన్నారి మృతికి కారణమైన దోషులను వెంటనే అరెస్టు చేసి,
హత్య కేసులు నమోదు చేయాలి. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం భూసేకరణ.. బాధితులకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ భరోసా



**హైదరాబాద్ పెన్ పవర్:** గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భూ సేకరణ జరుపుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ మూసీ ప్రాజెక్టు పైన విషం చిమ్ముతున్నారని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన చేయడం వాళ్లకు ఇష్టం లేదని మండిపడ్డారు. మూసీ బాగైతే హైదరాబాద్ ప్రజలు ఎప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ని గుర్తు పెట్టుకుంటారని బీఆర్ఎస్ భయం అని విమర్శించారు. గతంలో హుస్సేన్ సాగర్ నీళ్లను కొబ్బరి నీళ్లు చేస్తానని కేసీఆర్ బడాయి కబుర్లు చెప్పారని గుర్తుకు చేశారు.

**మల్లన్న సాగర్ బాధితులు చనిపోయారు..**

మూసీ కోసం వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని కేటీఆర్ మాటలు చెప్పి నగర ప్రజలను మోసం చేశారని, మూసీ పేరుతో కోట్ల రూపాయలు మేశారని ఆరోపించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం భూ సేకరణ జరుపుతోందని, బాధితుల డిమాండ్ లను ప్రభుత్వం వింటుందని స్పష్టం చేశారు. వాళ్లు సంతృప్తి చెందేలా పరిహారం ఇస్తామని భరోసా ఇచ్చారు. వాళ్లని రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని హరీశ్ రావు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అపార్ట్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చామని అక్కడికి వెళ్లి తెగ సానుభూతి చూపిస్తున్నాడని విమర్శించారు. మల్లన్న సాగర్ కోసం 14 గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించినప్పుడు హరీశ్‌రావుకి ఇవి గుర్తు రాలేదా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు చర్యల వల్ల మల్లన్న సాగర్ బాధితులు అనేక మంది చనిపోయారని ఆరోపించారు.

**ప్రతి పక్షాల వలలో చిక్కొద్దు..**

ఒకరు గ్రామం వదలలేక ఇంట్లోనే చితి పేర్చుకుని సజీవ దహనం చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు పోలీస్‌లను పెట్టి బలవంతంగా గ్రామాల నుండి నిర్వాసితులను ఈడ్చి వేశారని అన్నారు. అందులో హరీశ్‌రావు పాపమే ఉంది.. ఆ పాపాల భైరవుడు ఇప్పుడు చిలుక పలుకులు పలుకుతున్నాడని ఫైర్ అయ్యారు. మూసీ నిర్వాసితుల పట్ల మాకు సానుభూతి ఉంది.. వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతి పక్షాల వలలో చిక్కొద్దు.. ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా మేము కూడా చూస్తామని భరోసా కల్పించారు.

# గాంధీ విగ్రహా ఏర్పాటుపై కాంగ్రెస్ ఎంపీ క్లారిటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ కీలక నేత, మాజీమంత్రి హరీష్ రావుపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి(జష్ట్రుఝఝశ్రీు ఖఱతీుఅ ఖబఝుతీ =వ్యఎఎ) కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్ మెంట్ వాసులను హరీష్ రావు తప్పుదోవ పట్టించారు. ప్రభుత్వాన్ని నిందించాలని హరీష్ రావు చూస్తున్నారు. గాంధీ సరోవర్ కట్టాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదు. మధు పార్క్ రిడ్జ్ బిల్డర్లు 2012లో ఉన్న జీఓ ప్రకారం 30 మీటర్స్ బఫర్ ఉండాలి. గత ప్రభుత్వం కమీషన్లకు కకక్కుర్తి పడి హైదరాబాద్ నగరంలో ఇష్టానుసారంగా పర్మిషన్లు ఇచ్చారు. గత ప్రభుత్వం కమీషన్లు దండుకోవడం కోసం చేసిన పనికి అపార్ట్ మెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అపార్ట్ మెంట్ వాసులకు నష్ట పరిహారం ఇస్తుంది. బిల్డర్లపై కచ్చితంగా కేసులు పెడతాము. వారిచేత అపార్ట్ మెంట్ వాసులకు నష్ట పరిహారం కూడా ఇప్పిస్తాము. 30 మీటర్లు బఫర్ ఉండాల్సిన చోట 9 మీటర్లు బఫర్ చూయించి నాళా మీద మధు పార్క్ రిడ్జ్ బిల్డర్లు పర్మిషన్ తీసుకున్నారని చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇందులో ప్రజల తప్పు లేదు..**

రోజూ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధి, మూసీ పునరుజ్జీవం కావాలని రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు. మెట్రో ఫేజ్-2, మూసీ ప్రక్షాళన, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీ నిర్మాణం లక్ష్యంగా రేవంత్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. డీపీఆర్ ఎప్పుడు ఇస్తారో హరీష్ రావుకు తెలియదా?. సబర్మతి, గంగా నదుల పునరుజ్జీవం కోసం అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పుల వలన ప్రజలు తెలియక అపార్ట్ మెంట్స్ కొనుక్కున్నారు. ఇందులో ప్రజల తప్పు లేదు. గత ప్రభుత్వం అవినీతి ఉందని హరీష్ రావు తెలుసుకోవాలి. బీఆర్ఎస్ హయాంలో నాళాల మీద పర్మిషన్లు ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దాలని అనుకుంటున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రతి పనికి అడ్డుపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేయవద్దని బీఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఉప ఎన్నికలు మున్సిపల్ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల అభిమానం పెరిగిందని బీఆర్ఎస్‌కు అర్థం అయిందని చామల కిరణ్ కుమార్ వ్యాఖ్యానించారు.

# పవన్ ను కదిలించిన ఊరు.. రూ.50 లక్షల విరాళం, వెరీ ఇంట్రెస్టింగ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను ఓ గ్రామం కదిలిచింది. రెండేళ్ల క్రితం ఆ గ్రామానికి వెళ్లిన పవన్ లో సెంటిమెంట్ ను రగిలిచింది. అప్పటి నుంచి ఆ ఊరు పవన్ సొంతూరుగా మారిపోయింది. 20 నెలల వ్యవధిలో గ్రామం రూపురేఖలు మారిపోయేలా చేసింది. పంచాయతీ రాజ్ మంత్రిగా ప్రభుత్వ నిధులతో ఆ గ్రామాభివృద్ధికి బాటల పరిచిన పవన్.. గ్రామంపై పెంచుకున్న మమకారంతో సొంతంగా రూ.50 లక్షలు సమకూర్చారు. రాష్ట్రంలో వేలాది గ్రామాలు ఉండగా, పవన్ ఆ గ్రామంపై అంతలా ప్రేమ పెంచుకోవడానికి కారణం చాలా చిన్నదే. కానీ, అది చాలా తీవ్రమైన భావోద్వేగానికి సంబంధించినది.. ఆ సంబంధమే పవన్ ఇంటిపేరు. ఆ ఊరి పేరు ఒక్కటి కావడమే.. నిజమే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇంటి పేరు ఉండటమే నంద్యాల జిల్లాలోని 'కొణిదల' గ్రామం రూపురేఖలను మార్చివేసింది. నందికొట్కూరు మండలంలో ఉన్న ఈ గ్రామం 20 నెలల క్రితం వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పర్యటించిన పవన్ కల్యాణ్ తన ఇంటి పేరు ఉన్న గ్రామం కోసం తెలుసుకుని ప్రేమ పెంచుకున్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారు. అధికారంలోకి రాగానే 'కొణిదల' గ్రామాన్ని ప్రత్యేక ఆసక్తితో అభివృద్ధి చేయిస్తున్నారు పవన్.పంచాయతీరాజ్ మంత్రిగా కొణిదల గ్రామానికి అనేక నిధులు విడుదల చేశారు పవన్. పల్లెపండగ 1.0, పల్లెపండగ 2.0, సాస్కీ, గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ తదితర పథకాల ద్వారా వచ్చిన నిధులతో రోడ్లు, డ్రెయిన్లు, కాలువల అభివృద్ధి చేశారు. గోకులాలు, బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణ పథకం కింద గ్రామానికి భారీగానే లబ్ధి జరిగింది. సుమారు రూ. 6 కోట్లకు పైగా నిధులతో కొణిదెల గ్రామ రూపురేఖలే మార్చివేశారు పవన్. అంతేకాకుండా సొంతంగా రూ.50 లక్షలు విరాళంగా సమకూర్చి గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో పవన్ దృష్టిని కొణిదెల ఆకర్షించినట్లు చెబుతున్నారు. గత ఏడాది నందికొట్కూరు నియోజకవర్గంలో ఫారం పాండ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లిన సందర్భంలో ఇచ్చిన మాట ప్రకారం ఆ గ్రామాభివృద్ధికి రూ. 50 లక్షల విరాళం అందజేశారు. ఈ డబ్బుతో కొణిదెల గ్రామంలో 90 వేల లీటర్ల రక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. ఈ ట్యాంక్ కొణిదెల గ్రామంలో 2 వేల మంది దాహార్తి తీర్చనుంది. వేసవికి ముందే ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి కావడంపై పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి, గ్రామీణ నీటి సరఫరా విభాగం (=ఔా) అధికారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు.

పవన్ చొరవతో కొణిదెల గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. పల్లెపండగ 1.0లో సుమారు రూ. 20 లక్షలకు పైగా నిధులు వెచ్చించి మూడు రహదారులను నిర్మించారు. పల్లెపండగ 2.0లో రూ. 45 లక్షల అంచనా వ్యయంతో ఏడు సీసీ రోడ్లు నిర్మించారు. వీటితో పాటు గ్రామీణ రహదారి అభివృద్ధి సబ్ ప్లాన్ నిధులతో కొణిదెల గ్రామంలోని జిల్లా పరిషత్ స్కూల్ నుంచి పగిడ్యాల మండల పరిధిలోని లక్ష్మాపురం వరకు 5 కిలోమీటర్ల మేర బి.టి. రోడ్డు నిర్మాణానికి రూ. 4 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొణిదెల గ్రామం వరకు ఉన్న రోడ్డు పునరుద్ధరణ పనులకు రూ. 45 లక్షలు మంజూరు చేయించారు. వీటితో పాటు ఆ గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు 4 గోకులాలు, గృహ నిర్మాణశాఖ సహకారంతో 19 ఇళ్లు, నీటితొట్టెలు నిర్మించారు. రైతుల కోసం 49 ఫీడర్ ఛానల్స్ ను జాతీయ ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేశారు. రెండు మైనర్ కాలువల పునరుద్ధరణ, మూడు కమ్యూనిటీ చెక్ డ్యామ్స్ మరమ్మత్తులు పూర్తి చేశారు. ఇచ్చిన హామీ మేరకు గ్రామస్తులు అడిగిన ప్రతి పని చేస్తూ కొణిదలను తన సొంతూరుగా మార్చుకున్నారు పవన్.

# మావోయిస్టు అగ్రనేత 'దేవ్ జీ' లొంగుబాటు.. 6 దశాబ్దాల సాయుధ పోరాటానికి తెర!



**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆరు దశాబ్దాల సాయుధ పోరాటం ముగింపు దశకు చేరిందన్న సంకేతాలను నిజం చేస్తూ ఆ పార్టీ అగ్రనేత దేవ్ జీ తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతోపాటు మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు రాజిరెడ్డి, మరో 16 మంది కీలక నేతలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దేవ్ జీ టార్గెట్ గా కేంద్ర బలగాలు రెండు రోజుల కిందట ఆపరేషన్ కర్రె గుట్టలు–2 చేపట్టినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దేవ్ జీతోపాటు మావోయిస్టు కీలక నేతలు తెలంగాణలోని అసిఫాబాద్ అడవుల్లో ఎస్ఐబి పోలీసులకు లొంగిపోయినట్లు చెబుతున్నారు. దేవ్ జీ లొంగుబాటును ఇంకా అధికారికంగా ప్రకటించాల్సివుంది.మావోయిస్టు ప్రధాన కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి లొంగుబాటు వార్తలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్ ఆవిష్కరిస్తామని కేంద్రం ప్రకటించింది. మునుపెన్నడూ లేనట్లు తీవ్ర నిర్బంధం అమలు చేయడంతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరి అయింది. ఈ నేపథ్యంలో కీలక నేతలు ఉద్యమాన్ని వదిలి ఒక్కొక్కరుగా బయటకు వచ్చారు. మరికొందరు అగ్రనేతలు పోలీసు ఎన్ కౌంటరులో అసువులు బాశారు. కొద్ది నెలల క్రితం మావోయిస్టు కేంద్ర కమిటీ నేత మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న లొంగుబాటు సంచలనం సృష్టించింది. ఇప్పుడు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి దేవ్ జీ లొంగిపోవడంతో ఉద్యమాన్ని నడిపే నాథుడే కరువైనట్లు వ్యాఖ్యానిస్తున్నారు.

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మరణం తర్వాత దేవ్ జీ పార్టీ బాధ్యతలు స్వీకరించారు. ఆపరేషన్ కగార్ కొనసాగుతుండగానే ఆయన పార్టీ బాధ్యతలు భుజానకెత్తుకున్నారు. నంబాల కేశవరావు ఎన్కౌంటర్ తర్వాత దేవ్ జీ లక్ష్యంగా బలగాలు పావులు కదిపాయి. ఈ క్రమంలోనే గత ఏడాది నవంబరులో దేవ్ జీ విజయవాడలో పోలీసులకు చిక్కినట్లు ప్రచారం జరిగింది. విజయవాడ, ఏలూరు, కాకినాడల్లో తలదాచుకున్న సుమారు 50 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దేవ్ జీ వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఉన్నట్లు అప్పట్లో పోలీసులు ప్రకటించారు.ంఅయితే అప్పట్లో దేవ్ జీ అరెస్టుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. కానీ దేవ్ జీ సురక్షితంగా ఉన్నట్లు మావోయిస్టులు ప్రకటించడంతో ఈ వదంతులకు ఫుల్ స్టాప్ పడ్డాయి. ఇక తాజాగా దేవ్ జీ లొంగుబాటులో ఉద్యమం చివరి దశకు చేరుకున్నట్లు భావిస్తున్నారు. దేవ్ జీతోపాటు కీలక నేత మల్లా రాజిరెడ్డితోపాటు మరో 16 మంది లొంగిపోయారన్న వార్తలతో మావోయిస్టు ఉద్యమం పరిసమాప్తమైనట్లే అంటున్నారు. గత ఏడాది మావోయిస్టు పార్టీ బాధ్యతలు చేపట్టిన దేవ్ జీ తెలంగాణలోకి జగిత్యాల జిల్లా కోరుట్ల. 1982లో విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితులైన తిరుపతి అప్పట్లోనే నక్సల్ ఉద్యమం కోసం అడవి బాట పట్టారు. పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 1993–94 ప్రాంతంలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా ఎంపికయ్యారు. మావోయిస్టు పార్టీలో నక్సలైట్లు విలీనం అయిన తర్వాత దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఏర్పాటు చేసిన తొలి దళానికి తిరుపతి కమాండర్ గా పనిచేసినట్లు చెబుతున్నారు. తిరుపతికి దేవ్ జీతోపాటు అనేక మారుపేర్లతో పిలుస్తారు. సంజీవ్, చేతన్, సుదర్శన్, రమేష్ వంటి పేర్లతో తిరుపతి పనిచేశారు.

# గ్రీన్ కార్డ్ కోసం 19 నెలల నిరీక్షణ: అమెరికా వలస వ్యవస్థలోని 'అనిశ్చితి'కి నిలువుటద్దం




**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా కలని నిజం చేసుకునే క్రమంలో గ్రీన్ కార్డ్ అనేది ఒక కీలక మైలురాయి. అయితే ఆ మైలురాయిని చేరుకోవడానికి కొందరికి పట్టే సమయం వర్ణనాతీతం. ఇటీవల ఒక వలసదారుడు రెడ్డిట్ వేదికగా పంచుకున్న తన 19 నెలల సుదీర్ఘ నిరీక్షణ కథనం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. ఇది కేవలం ఒక వ్యక్తి ఆవేదన మాత్రమే కాదు.. వేలాది మంది వలసదారులు ఎదుర్కొంటున్న వ్యవస్థాగత జాప్యానికి నిదర్శనం.

### ఒక దరఖాస్తు.. రెండేళ్ల నిరీక్షణ

సదరు అభ్యర్థి సెప్టెంబర్ 2024లో కుటుంబ ఆధారిత వలస కోసం ఐ–130 , ఐ–485 దరఖాస్తులను సమర్పించారు. ఫిబ్రవరి 2025లో ఐ–130 ఆమోదం పొందినప్పటికీ అసలైన ఐ–485 మాత్రం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. సాధారణంగా ఐ–130 ఆమోదం పొందాక ప్రక్రియ వేగవంతం కావాలి.. కానీ ఇక్కడ 19 నెలలు గడిచినా ఫలితం లేకపోవడం గమనార్హం.

### పాక్షిక ఊరట.. కానీ పూర్తి భరోసా లేదు..

ప్రస్తుతానికి సదరు అభ్యర్థికి వర్క్ ఆథరైజేషన్ (ఈఏడీ) , అడ్వాన్స్ పరోల్ (ట్రావెల్ పర్మిట్) లభించాయి. ఇంటర్వ్యూ లేకుండానే ఇవి ఆమోదం పొందడం సానుకూలాంశమే అయినా అవి తాత్కాలిక ఉపశమనాలు మాత్రమే. ఇప్పటికీ సదరు అభ్యర్థి ఎఫ్–1 స్టూడెంట్ వీసా స్టేటస్‌లోనే కొనసాగుతున్నారు. గ్రీన్ కార్డ్ చేతికి వచ్చే వరకు కెరీర్ , వ్యక్తిగత జీవితంలో ఎటువంటి ధీమా ఉండదు. ఏ క్షణంలో ఏ మార్పు వస్తుందో అన్న భయం వలసదారులను వేధిస్తోంది.

### జాప్యానికి కారణాలు ఏమిటి?

వలస నిపుణుల విశ్లేషణ ప్రకారం.. ఈ జాప్యానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. యూఎస్.సీఐఎస్ కి చెందిన కొన్ని ఫీల్డ్ ఆఫీసులు వేగంగా పని చేస్తాయి. మరికొన్ని ఆఫీసుల్లో దరఖాస్తుల భారం ఎక్కువగా ఉండటం వల్ల ఏళ్ల తరబడి సమయం పడుతుంది. అభ్యర్థి స్థానిక కాంగ్రెస్ ప్రతినిధి ద్వారా విచారణ జరిపించినా యూఎస్.సీఐఎస్ నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడం.. వ్యవస్థలో ఉన్న పారదర్శకత లోపాన్ని సూచిస్తోంది.

### బాధితులకు ఉన్న మార్గాలేమిటి?

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నవారు చట్టపరమైన నిపుణుల సలహా మేరకు నడుచుకోవాలి. మొదటి ఇంక్వైరీ జరిగి చాలా కాలం అయినందున, మరోసారి ప్రజా ప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకురావడం ముఖ్యం. ప్రభుత్వం తన విధిని సక్రమంగా నిర్వహించనప్పుడు కోర్టు ద్వారా ఆదేశాలు జారీ చేయించడం. ఇది యూఎస్.సీఐఎస్ ని నిర్ణయం తీసుకునేలా నిర్బంధిస్తుంది. ఇమ్మిగ్రేషన్ న్యాయవాదుల సలహాతో కేసులో సాంకేతిక లోపాలు ఏవైనా ఉన్నాయేమో సరిచూసుకోవడం అవసరం.ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములవుతూ చట్టబద్ధంగా దరఖాస్తు చేసుకున్న వలసదారులు ఇలాంటి అనిశ్చితిని ఎదుర్కోవడం దురదృష్టకరం. 19 నెలల నిరీక్షణ అనేది కేవలం సమయానికి సంబంధించింది కాదు.. అది ఒక వ్యక్తి భవిష్యత్తు , మానసిక ప్రశాంతతకు సంబంధించింది. ఇప్పటికైనా యూఎస్.సీఐఎస్ తన ప్రాసెసింగ్ సమయాన్ని మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# టెక్సాస్‌లో షాకింగ్ వీడియోలు: భారతీయుల ప్రవర్తనపై విమర్శలు..



**హైదరాబాద్ పెన్ పవర్:** సోషల్ మీడియా 'రీల్స్' పిచ్చి మనుషులను ఏ స్థాయికి తీసుకువెళ్తుందో చెప్పడానికి డల్లాస్‌లోని పయనీర్ ప్లాజా వద్ద చోటుచేసుకున్న తాజా పరిణామాలు ఒక ఉదాహరణ. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాల్లో అది కూడా స్థానిక సమాజాల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న చోట మన తెలుగు యువత చేసిన నృత్యాలు, వీడియోలు ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీశాయి. ఇది కేవలం ఒక చిన్న సమూహం చేసిన పనిగా కొట్టిపారేయలేం.. ఇది విదేశాల్లో భారతీయుల, ముఖ్యంగా తెలుగు వారి ప్రతిష్టపై పడుతున్న మచ్చగా భావించాల్సి ఉంటుంది.

### చరిత్రను గుర్తించాలి.. భావోద్వేగాలను గౌరవించాలి

టెక్సాస్‌లోని పయనీర్ ప్లాజాలో ఉన్న భారీ ఎద్దుల విగ్రహాలు కేవలం పర్యాటక ఆకర్షణలు మాత్రమే కాదు. అవి అమెరికా చరిత్రలోని 'క్యాటిల్ డ్రైవ్' కాలానికి సాక్ష్యాలు. ఒక వర్గానికి ఇది ఆర్థిక ప్రగతికి చిహ్నమైతే, అక్కడి మూలవాసులైన నేటివ్ అమెరికన్లకు అది వారి భూములు, ప్రాణాలు కోల్పోయిన విషాదకర గతం. అటువంటి సున్నితమైన ప్రదేశాన్ని ఒక డ్యాన్స్ ఫ్లోర్‌లా మార్చేయడం స్థానికులను ఆగ్రహానికి గురిచేయడంలో ఆశ్చర్యం లేదు. ఒక దేశ సంస్కృతి ఆ దేశ ప్రజల హృదయాల్లో, ఆత్మల్లో ఉంటుంది అని మహాత్మా గాంధీ అన్నారు. ఆయన వారసులుగా మనం దాన్ని పాటించాలి.. కానీ మనం వెళ్ళింది పర్యాటకులుగా అయినా, వలసదారులుగా అయినా.. ఆ నేల చరిత్రను గౌరవించడం మన ప్రాథమిక బాధ్యతగా ఉండాలి. కొందరు భారతీయ యువత దీన్ని మరిచిపోతున్నారు.

### గ్లోబల్ సిటిజన్‌గా ఎదగాలి

తెలుగు రాష్ట్రాల నుంచి ఐటీ ఉద్యోగాల కోసం ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. డల్లాస్ లాంటి నగరాల్లో మన వారి ప్రాబల్యం పెరగడం గర్వకారణమే. అయితే సంఖ్యతో పాటు సామాజిక అవగాహన కూడా పెరగాలి. చారిత్రక కట్టడాల వద్ద రీల్స్ చేయడం వల్ల వచ్చే కొన్ని 'లైక్స్' కోసం దేశం గౌరవాన్ని పణంగా పెట్టడం విజ్ఞత అనిపించుకోదు. విదేశాల్లో ఉన్నప్పుడు మనం కేవలం వ్యక్తులుగా మాత్రమే కాదు.. మన దేశ ప్రతినిధులుగా కనిపిస్తాం. అక్కడ మనం చేసే ప్రతి పని భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా మారుతుంది.

### వినోదం మితిమీరకూడదు

సోషల్ మీడియా యుగంలో కంటెంట్ క్రియేషన్ అనేది తప్పు కాదు. కానీ అది ఎక్కడ చేస్తున్నాం? ఎవరి మనోభావాలను దెబ్బతీస్తున్నాం? అనే విజ్ఞత ముఖ్యం. 'రోమ్ లో ఉన్నప్పుడు రోమన్ లాగే ప్రవర్తించు' అనే సామెత కేవలం ఆహారపు అలవాట్లకే కాదు.. అక్కడి సంస్కృతిని, చరిత్రను గౌరవించడానికీ వర్తిస్తుంది. అమెరికా వంటి దేశాల్లో స్థానిక చట్టాలు, ఆచారాల పట్ల అవగాహన పెంచుకోవాల్సిన బాధ్యత మన కమ్యూనిటీ సంఘాలపై కూడా ఉంది. ఇకనైనా ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భాధ్యతాయుతమైన 'గ్లోబల్ తెలుగు' పౌరులుగా మనం ఎదగాలి.

# ఇండియన్ 'ఎప్‌స్టీన్' ఫైల్స్: 33 మంది చిన్నారుల జీవితాలతో చెలగాటం.. దంపతులకు ఉరిశిక్ష!



**హైదరాబాద్ పెన్ పవర్:** సమాజంలో గౌరవప్రదమైన ఉద్యోగం.. చుట్టూ నాగరిక ప్రపంచం.. కానీ ఆ ఇంటి గోడల వెనుక సాగుతున్నది మాత్రం నరకప్రాయమైన క్రీడ. అమెరికాను వణికించిన 'ఎప్‌స్టీన్' లైంగిక కుంభకోణం తరహాలోనే ఉత్తరప్రదేశ్‌లో వెలుగుచూసిన ఈ దారుణ ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. పదేళ్లపాటు చిన్నారులను వేధిస్తూ ఆ దృశ్యాలను డార్క్ వెబ్‌లో విక్రయించిన కిరాతక దంపతులకు న్యాయస్థానం మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది.

### అమాయకత్వమే పెట్టుబడిగా.. చీకటి వ్యాపారం

బందా జిల్లాకు చెందిన రామ్ భవన్ ప్రభుత్వంలో జూనియర్ ఇంజనీర్‌గా పనిచేసేవాడు. బయటకు విద్యావంతుడిగా కనిపించినా లోపల మాత్రం ఒక రాక్షసుడు దాగి ఉన్నాడని సీబీఐ విచారణలో తేలింది. ఇతనికి భార్య దుర్గావతి పూర్తిస్థాయిలో సహకరించేది. వీరిద్దరూ కలిసి 2010 నుండి 2020 వరకు ఒక పక్కా ప్రణాళికతో ఈ అఘాయిత్యాలకు పాల్పడ్డారు. 3 నుండి 16 ఏళ్ల వయస్సున్న పేద కుటుంబాలకు చెందిన బాలురకు చాక్లెట్లు, బిస్కెట్లు, మొబైల్ ఫోన్లు చూపి ఆశ చూపించి చిన్నారులను నిర్బంధించి లైంగిక దాడులు చేయడం, వాటిని వీడియోలు తీయడం విక్రయించి సొమ్ము చేసుకోవడం చేశారు.

### డార్క్ వెబ్ – గ్లోబల్ నెట్‌వర్క్

ఈ కేసులో అత్యంత విస్మయం కలిగించే అంశం ఏంటంటే వీరు తీసిన అశ్లీల వీడియోలను కేవలం భద్రపరుచుకోకుండా అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారం చేశారు. ఎన్క్రిప్టెడ్ యాప్స్ ద్వారా విదేశీ కస్టమర్లకు లైవ్ స్ట్రీమింగ్ చేసేవారు. అమెరికా, యూరప్ దేశాల్లోని చైల్డ్ పోర్నోగ్రఫీ మాఫియాతో వీరికి ప్రత్యక్ష సంబంధాలున్నట్లు సీబీఐ గుర్తించింది. సీబీఐ దాడుల్లో స్వాధీనం చేసుకున్న హార్డ్ డిస్కలలో వేల సంఖ్యలో అభ్యంతరకర వీడియోలు లభ్యమయ్యాయి. పిల్లలు ఎవరైనా ఎదురు తిరిగితే వారి తల్లిదండ్రులను చంపేస్తామని, గొలుసులతో కట్టేసి బెల్టులతో కొట్టేవారని బాధితులు వాపోయారు.

### న్యాయస్థానం ఆగ్రహం: అరుదైన కేసుల్లో అత్యంత అరుదైనది

ఈ కేసును విచారించిన ప్రత్యేక పోక్సో కోర్టు, నిందితుల చర్యలను నాగరిక సమాజం తలదించుకునేలా ఉన్నాయని అభివర్ణించింది. రామ్ భవన్ , అతని భార్య దుర్గావతికి మరణశిక్ష ఖరారు చేసి సంచలన తీర్పునిచ్చింది. బాధితులైన 33 మంది బాలురకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల చొప్పున తక్షణ పరిహారం చెల్లించాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### మన చుట్టూ ఉన్న ప్రమాదంపై హెచ్చరిక

ఈ ఘటన డిజిటల్ యుగంలో మన పిల్లల భద్రత ఎంత ప్రమాదంలో ఉందో మరోసారి గుర్తుచేస్తోంది. కేవలం బయటి వ్యక్తులే కాదు.. మనకు తెలిసిన వారు, గౌరవప్రదమైన హోదాల్లో ఉన్నవారు కూడా ఇటువంటి నేరాలకు పాల్పడవచ్చని ఈ 'ఇండియన్ ఎప్‌స్టీన్' కేసు నిరూపించింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఆంత్రోపిక్ పోస్టుతో ఆగమాగం.. ఐటీ కంపెనీల షేర్లు 9 శాతం వరకు డౌన్




న్యూయార్క్: ఏఐ టెక్నాలజీ సంస్థ ఆంత్రోపిక్ సోషల్ మీడియా పోస్టు అమెరికా స్టాక్ మార్కెట్‌ను వణికించింది. కొత్త ఏఐ సెక్యూరిటీ ఫీచర్ ప్రవేశపెటినట్టు ప్రకటించడంతో అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. క్రౌడ్‌స్ట్రైక్, ఆక్టా క్లౌడ్‌ఫ్లేర్ వంటి ప్రముఖ సంస్థల షేర్లు 5 శాతం నుంచి 9 శాతం వరకు పడిపోయాయి. ఇన్వెస్టర్లు దాదాపు 10 బిలియన్ డాలర్లు నష్టపోయారు. సాఫ్ట్‌వేర్ కోడ్‌లోని లోపాలను గుర్తించి సరిచేసే సామర్థ్యం ఈ క్లాడ్ కోడ్ సెక్యూరిటీకి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. సంప్రదాయ భద్రతా పద్ధతులకు ప్రత్యామ్నాయంగా ఏఐ ఆధారిత సాధనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నారు. గ్లోబల్ ఎక్స్ సైబర్ సెక్యూరిటీ ఈటీఎఫ్ కూడా 2023 నవంబర్ స్థాయికి పడిపోయింది.

# స్పాటిఫైలో సూపర్ ఫీచర్.. సాంగ్ ట్రాన్స్లేషన్ తో భాష తెలియకపోయినా...




ఏ ప్రదేశంలో ఉన్నా మనసును హత్తుకునే పాటలు వినాలనిపిస్తే స్పాటిఫై ఆన్ చేస్తుంటారు చాలామంది. ఈ యాప్‌లో అనేక రకాల పాటలు, వివిధ భాషల్లో అందుబాటులో ఉన్నాయి. భాష తెలియకపోయినా వినాలనిపిస్తుంటాయి కొన్ని సాంగ్స్. అయితే, కొన్నిసార్లు ఆ సాంగ్స్ మన భాషలో లేకపోయినా దాని భావం తెలిస్తే బాగుండు అనిపిస్తుంది. అందుకే స్పాటిఫై లిరిక్స్ కార్డ్ మీద ట్రాన్స్?లేటర్ ఫీచర్? తీసుకొచ్చింది. ఈ సింబల్‌పై ట్యాప్ చేస్తే పాట కింద టెక్స్ట్ ట్రాన్స్‌లేట్ అయి కనిపిస్తుంది.

డివైజ్ లాంగ్వేజ్ సెట్టింగ్స్‌ను బట్టి అనువాదం ఆధారపడి ఉంటుంది. అంతేకాదు.. ఆఫ్?లైన్ లిరిక్స్ సపోర్ట్‌నూ అందిస్తోంది స్పాటిఫై. యూజర్లు ఆఫ్‌లైన్‌లో పాట వినడానికి డౌన్?లోడ్ చేసుకున్నప్పుడు లిరిక్స్ కూడా సేవ్ అవుతాయి. ట్రావెలింగ్‌లో, ఇంటర్నెట్ సర్వీస్?లు లేని చోట్ల ఇది బాగా పనికొస్తుంది. నౌ ప్లేయింగ్ వ్యూలో లిరిక్ ప్రివ్యూల కోసం కొత్త డిజైన్?ను తీసుకొచ్చింది. ఆల్బమ్ ఆర్ట్ వర్క్ లేదా కాన్వాస్ క్లిప్స్ కింద లిరిక్స్ నౌ అని కనిపిస్తుంది. దీంతో పాట వింటున్నప్పుడు అవే లిరిక్స్ చూడడం ఈజీ అవుతుంది.

# పట్టుదలతో ఏదైనా సాధ్యమే.. శివయ్య సాయం..కొత్త ప్రేరణ



నందిగామ గ్రామంలో ఐదవ తరగతి వరకు మాత్రమే ప్రభుత్వ పాఠశాల ఉంది. హైస్కూల్‌లో చదువుకోవడానికి పది కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే రామాయంపేట వస్తుంది. అక్కడికి రోజూ నడుచుకుంటూ బడికి వెళ్లేవాడు వంశీ. శ్రద్ధగా చదువుకునేవాడు. వంశీకి చదువంటే ఎంత ఇష్టమంటే.. ఆ పది కిలోమీటర్ల దూరం కూడా అతనికి ఆటంకంగా కనిపించలేదు. రోజూ ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి, తల్లి పెట్టిన చద్దన్నం తిని, తన పాత పుస్తకాల సంచి భుజాన వేసుకుని బయలుదేరేవాడు. దారిలో కాళ్లకి ముళ్లూ, రాళ్లూ గుచ్చుకున్నా, వర్షంలో తడిచినా, ఎండలో మాడినా అతనికి లెక్కలేదు. తన లక్ష్యం ఒక్కటే.. బాగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించి తన తల్లిదండ్రుల కష్టాలు తీర్చాలి.

ఒకరోజు వంశీ రామాయంపేట వైపు వెళ్తుండగా, దారిలో ఒక లారీ ఆగి ఉంది. డ్రైవరు కిందికి దిగి టైరు మార్చుకుంటున్నాడు. వంశీని చూసి డ్రైవరు, “అబ్బాయి, ఇంత పొద్దున్నే ఎక్కడికి వెళ్తున్నావ్?” అని అడిగాడు. “బడికి అంకుల్, రామాయంపేటలో చదువుకుంటున్నాను” అని చెప్పాడు వంశీ.

డ్రైవరు ఆశ్చర్యపోయి, “అంత దూరం నడుచుకుంటూ వెళ్తావా? నిజంగా నీ పట్టుదలకు మెచ్చుకోవాలి” అంటూ వంశీని తన లారీలో ఎక్కించుకున్నాడు. ఆరోజు నుంచి ప్రతిరోజూ ఆ డ్రైవర్ వంశీని తన లారీలో బడి దగ్గర దించేవాడు. డ్రైవర్ పేరు శివయ్య. అతను కూడా పేదరికంలో పెరిగినవాడే. అందుకే వంశీ కష్టాన్ని అర్థం చేసుకున్నాడు. శివయ్య సాయంతో వంశీ సమయానికి బడికి వెళ్లడం, తిరిగి రావడం కుదిరింది. చదువుపై మరింత శ్రద్ధ పెట్టగలిగాడు. ఆ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో వంశీ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించాడు. ఈ విషయం తెలిసి అందరూ ఆశ్చర్యపోయారు. ముఖ్యంగా వంశీ తల్లిదండ్రులు ఆనందంతో ఉప్పొంగిపోయారు. ఆ తరువాత, వంశీకి మంచి కాలేజీలో సీటు లభించింది. చదువు పూర్తయ్యాక, సాఫ్ట్?వేర్ ఇంజినీర్‌గా ఒక పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది.

వంశీ తన జీతం డబ్బులతో తల్లిదండ్రులకు ఒక కొత్త ఇల్లు కట్టించాడు. ఆ ఇంటికి “శివయ్య నివాస్” అని పేరు పెట్టాడు. తన కష్టంలో తోడుగా నిలిచిన శివయ్యను జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేదు. వంశీ పట్టుదల, శివయ్య దయతో నందిగామ గ్రామంలో ఒక కొత్త ప్రేరణ మొదలైంది. పిల్లలందరూ కష్టపడి చదువుకోవడం మొదలుపెట్టారు.

# పచ్చి మిరప నుంచి పొడి వరకూ..గ్లోబల్ మార్కెట్‌ను కట్టిపడేస్తున్న మన దేశ మిరపకాయలు





ప్రపంచవ్యాప్తంగా మిర్చి వినియోగం పెరుగుతుండటంతో భారత ఎగుమతులు గణనీయ వృద్ధి సాధించాయి. ఎగుమతుల పరిమాణం విలువ రెండింటిలోనూ పెరుగుదల నమోదు అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో మిర్చికి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో భారత మిరప ఎగుమతులు లక్షల టన్నుల స్థాయికి చేరుతున్నాయి. ముఖ్యంగా ఆసియా, యూరప్ దేశాల నుంచి అధిక ఆర్డర్లు వస్తున్నాయి. ప్రపంచ మిరప ఉత్పత్తిలో మన దేశం అగ్రగామిగా ఉంది.

ప్రపంచవ్యాప్తంగా మిరప ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మిర్చి ఉత్పత్తిదారు, వినియోగదారు ,ఎగుమతిదారు కూడా. దేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. ఇండియా తర్వాత బంగ్లాదేశ్, థాయిలాండ్, చైనా, ఇథియోపియా, మయన్మార్, పాకిస్తాన్ వంటి దేశాలు ఎక్కువగా మిర్చి ఉత్పత్తి చేస్తున్నాయి.

మన దేశంలో ఏడాది పొడవునా ఉత్పత్తికి మద్దతు ఇచ్చే విభిన్న వాతావరణ పరిస్థితులతో చాలా రాష్ట్రాలలో మిరపపంటను సాగు చేస్తారు. విస్తృత సాగు విస్తీర్ణం, అనుకూలమైన వ్యవసాయ-వాతావరణ పరిస్థితులు, ఎన్నో ఏళ్లుగా సుగంధ ద్రవ్యాల వ్యవసాయ పద్ధతులు భారతదేశం ప్రపంచ మిరప ఉత్పత్తిలో ముందంజలో ఉంది. భారతీయ వంటకాలలో మిరప ముఖ్యమైన పదార్థం. దీనికి నిరంతర డిమాండ్ ఉండటంతో వాణిజ్యపంటగా ఎగుమతి చేస్తారు. ప్రభుత్వ మద్దతు, నీటిపారుదల విస్తరణ ,మెరుగైన విత్తన రకాలు ఉత్పాదకతను మరింత బలోపేతం చేశాయి.

మిరప పండించే రాష్ట్రాలు

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ,మధ్యప్రదేశ్‌తో మిర్చి పంటను పండించే రాష్ట్రాల్లో ముందు వరసలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో తగిన ఉష్ణోగ్రతలు, సారవంతమైన నేల ,నీటిపారుదల మౌలిక సదుపాయాలు మిరప పంట సాగుకు దోహదం చేస్తాయి. ఆయా రాష్ట్రాల్లో వివిధ రకాల పచ్చి మిర్చి ని పండిస్తాయి.

**మిరప సాగుకు అనువైన వాతావరణం, నేల**

మిరప సాగుకు అనువైన నేలలు, వాతావరణం మన దేశంలో విస్తృతంగా ఉన్నాయి. మిరప సాగుకు వెచ్చని ఉష్ణోగ్రతలు, మోస్తరు వర్షపాతం, సారవంతమైన ఎర్ర నెలలు అవసరం. భారత దేశమంతటా ఉష్ణమండల, ఉపఉష్ణమండల వాతావరణ పరిస్థితులు మిరప అధిక దిగుబడిని అందిస్తాయి. సూర్యరశ్మి, సరైన తేమ సమతుల్యత ఘాటు, దిగుబడి నాణ్యతను పెంచుతాయి.

**మిరకాయల ఎగుమతి**

ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా అంతటా అనేక దేశాలకు భారత్ మిరప ఉత్పత్తులను ఎగుమతి చేస్తుంది. ఈ మసాలా సుగంధద్రవ్య వాణిజ్యంలో కీలక పాత్ర మిర్చిది. రైతు ఆదాయం, ఎగుమతుల ఆదాయాన్ని అందిస్తుంది. భారత్ నుంచి పొడులు ,సాస్‌లు వంటి ప్రాసెస్ చేసిన మిరప ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంది.

# ఆధ్యాత్మికం: ద్వేషం.. హింస అంతా నష్టమే.. విదురనీతి మానవ జీవనానికి సోపానం..!



“ఒకరి మీద ద్వేషం, దాని కారణంగా వానిని జయించాలనీ, హింసించాలనీ అనుకోవడం దుఃఖ కారణం. అలాగే ఎదుటివారిని నిందించేవాడు కూడా శోకసంతుప్తుడవుతాడు. వీటికి అతీతంగా ఉంటే ఏ బాధా ఉండదు. సత్యవాక్పాలన, ఇంద్రియ విజయం, మృదు స్వభావం.. ఇవి ఉత్తమ పురుష లక్షణాలు. వాగ్దానంతో ఆగకుండా పని నెరవేర్చటం, నిష్కల్మష హృదయంతో సానుభూతి ప్రకటించడం, ఎదుటివారి దోషాలను గ్రహించటం.. మధ్యమ లక్షణాలు. నిరంతరం క్రోధంతో ఎవరికో ఒకరికి హాని తలపెడుతూ, కఠోరంగా దండించేవాడు అధముడు. స్నేహితుల వల్ల ఉపకారం లేదని.. వారిని దూరం చేసేవాడు అధమాధముడు. దుర్జన సాహచర్యంతో ధనం సంపాదించేవానిని సజ్జనులు హర్షించరు. సదాచారపరుడై తపస్సు, యజ్ఞకర్మలు నిర్వర్తిస్తూ, వివాహ బంధాన్ని లక్షణంగా కొనసాగిస్తూ, అన్నదానంతో దరిద్రులకు తృప్తి కలిగించేవాడు కులీనుడు, సజ్జనుడు అని వేదవేత్తలు చెబుతున్నారు. తల్లిదండ్రులకు కష్టం కలిగించకుండా ప్రసన్న చిత్తంతో ఉంటే ఉత్తముడు” అని ఉద్యోగ పర్వంలో విదురుడు ధృతరాష్ట్రుడికి నీతి బోధ చేశాడు. ఉషశ్రీ భారతం ప్రకారం విదురనీతి మానవ జీవన సోపానానికి, వ్యక్తిత్వ వికాసానికి ఉత్తమమైనది. ఇది ఎల్లవేళలా అనుసరించదగినది. ఇక్కడ విదురుడు చెప్పిన అంశాలన్నీ దుర్యోధనుడికి వర్తించేవిగా కనిపిస్తాయి. నిరంతరం పాండవుల మీద ద్వేషం పెంచుకుంటూనే ఉన్నాడు. ఆ కారణంగానే వారిని ఏదో ఒకరకంగా జయించాలనుకున్నాడు. ఉత్తర గోగ్రహణానికి కారణం అదే. అలాగే రాయబారిగా వస్తున్న శ్రీకృష్ణుడిని పట్టి బంధిస్తానన్నాడు.

బాల్యం నుండి పాండవులను హింసిస్తూనే వచ్చాడు. బాల్యక్రీడల సమయంలో తాళ్లతో బంధించి, నీళ్లలో పడేశాడు. అన్నంలో విషం కలిపించాడు. లక్క ఇల్లు నిర్మించి, అందులో వారిని కాల్చి చంపేయాలనుకున్నాడు. కపట ద్యూతం ఆడి, వారిని అడవులపాలు చేశాడు. ఇలా చెప్పుకుంటూ పోతే, దుర్యోధనుడు చేసిన హింసకు అంతే లేదు. నిరంతరం పాండవులను, శ్రీకృష్ణుడిని ఏదో ఒకనెపంతో నిందిస్తూనే ఉన్నాడు. ఇన్ని అవలక్షణాల కారణంగానే అందరికీ శోకం మిగిల్చాడు. ఇది నాడే కాదు.. నేటికీ వర్తిస్తుంది. రాజకీయాలలో నిరంతరం ఒకరిని ఒకరు నిందించుకుటూ, దూషించుకుంటూ, హింసించుకుంటూ ప్రజాపాలనను నిర్లక్ష్యం చేస్తున్నారు. ధనార్జనే ప్రథమ లక్ష్యంగా, పరదూషణే పరమావధిగా ఉండటం భారతంలో దుర్యోధనుడి దగ్గర నుండి కొనసాగుతూనే ఉంది. ఆనాడు విదురుడు చెప్పిన మాటలు నేటికీ శిరోధార్యమే. సక్రమ పాలన చేస్తూ, ప్రజలను రామునిలా కన్నబిడ్డల వలె పరిపాలించాలి అనుకునేవారికి విదురనీతి ఉత్తమం. శ్రీకృష్ణదేవరాయలు తన దగ్గర మంత్రిగా పనిచేస్తున్న తిమ్మరసు సూచనలను తు.చ. తప్పకుండా అనుసరించాడు. మగధ సామ్రాజ్యాన్ని విస్తరించి, సుపరిపాలన అందించడానికి చాణక్యుని సలహాలు.. చంద్రగుప్తునికి ఉపయోగపడ్డాయి. రాజులు ఏ పదవీ, సంపదలూ ఆశించని విదురుని వంటి నిస్వార్థమైన మంత్రులను తప్పనిసరిగా నియమించుకోవాలి. వారి మాటలను అనుసరించాలి.

ప్రభువులైన వారు స్వార్థపరులను దూరంగా ఉంచాలి

అనగనగా వంగ, కళింగ అని రెండు రాజ్యాలు ఉన్నాయి. వంగ దేశాన్ని ఆనంద వర్థనుడు, కళింగ దేశాన్ని విష్ణు వర్థనుడు పరిపాలించేవారు. వీరిరువురు స్వయంగా అన్నదమ్ములే. ఆనంద వర్థనుడికి ప్రజాశ్రేయస్సే ప్రధాన లక్ష్యం. అందుకోసం శాస్త్రజ్ఞానం తెలిసిన ఎనిమిది మంది మంత్రులను నియమించుకున్నాడు. వారి సలహాలు, సూచనలను అనుసరించి చక్కటి పరిపాలన అందిస్తూ, ‘ఈ ప్రభువు పాలన రామరాజ్యంలా ఉంది’ అనిపించుకున్నాడు.

విష్ణు వర్థనుడు ధనార్జనే ప్రథమ కర్తవ్యంగా... నలుగురు మూర్ఖులైన మంత్రులను నియమించుకున్నాడు. వారు నిరంతరం రాజు చేస్తున్న ప్రతి అరాచకాన్ని పొగుడుతూ, అక్రమంగా ధనం సంపాదించే మార్గాన్ని సూచిస్తూ వచ్చారు. అనతి కాలంలోనే విష్ణు వర్థనుడు కోట్లకు పడగలెత్తాడు.

ఆనంద వర్థనుడు మాత్రం మంచి రాజుగా పేరు తెచ్చుకున్నాడు. ఇలా కొన్ని సంవత్సరాలు సాగింది. కొంతకాలానికి విష్ణు వర్థనుడి రాజ్యంలోని ప్రజలు తిరుగుబాటు చేశారు. విష్ణు వర్థనుడు రాజ్యాన్ని విడిచిపెట్టి అడవులకు పారిపోయాడు.

మంత్రులు సైతం రాజును అనుసరించారు. అప్పుడు ప్రజలంతా ఆనంద వర్థనుడిని తమకు రాజుగా ఎన్నుకున్నారు. రెండు రాజ్యాలను ఆనంద వర్థనుడు తన రెండు కళ్లుగా భావించి, సుపరిపాలన అందించాడు. అన్యాయం ఎంతో కాలం కొనసాగదు. న్యాయం, ధర్మమే చిరస్థాయిగా నిలబడతాయి. ధర్మానికి కొంత కాలం విఘాతం కలిగినా, శాశ్వతంగా నిలబడేది మాత్రం ధర్మమే.

# కుక్క నాకడంతో ఇన్ఫెక్షన్... కాళ్లు, చేతులు కోల్పోయిన మహిళ!

- బ్రిటన్‌లో కుక్క నాలుక తగలడంతో మహిళకు తీవ్ర అస్వస్థత
- శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి చేరిన ప్రమాదకర బ్యాక్టీరియా
- సెప్సిస్ కారణంగా రెండు చేతులు, రెండు కాళ్లు తొలగించిన వైద్యులు
- కుక్కల లాలాజలంలోని ‘క్యాప్‌నోసైటోఫాగా’ బ్యాక్టీరియాతోనే ముప్పు
- సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన మహిళ





బ్రిటన్‌లో నివసిస్తున్న భారత సంతతి మహిళ జీవితంలో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్క.. మహిళ గాయాన్ని నాకడంతో ఆమె సెప్సిస్ బారిన పడి, రెండు చేతులు, రెండు కాళ్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన పెంపుడు జంతువుల యజమానులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

వివరాల్లోకి వెళితే, యూకేలోని వుల్వర్‌హాంప్టన్‌కు చెందిన మంజిత్ సంఘా (52) అనే మహిళ గత ఏడాది జూలైలో అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన ఆమెకు అనారోగ్యంగా అనిపించగా, మరుసటి రోజు ఉదయానికి స్పృహ కోల్పోయారు. ఆమె చేతులు, కాళ్లు చల్లగా మారడం, పెదవులు నీలంగా మారడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఆమె భర్త కమల్‌జిత్ సంఘా బీబీసీకి వివరిస్తూ, “ఒక్క రోజులో అంతా మారిపోయింది. శనివారం కుక్కతో ఆడుకుంది, ఆదివారం పనికి వెళ్లింది, సోమవారానికి కోమాలోకి వెళ్లిపోయింది” అని ఆవేదన వ్యక్తం చేశారు. న్యూ క్రాస్ ఆసుపత్రిలోని ఐసీయూలో చేర్చిన వైద్యులు, ఆమె సెప్సిస్‌తో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. కుక్కల లాలాజలంలో సహజంగా ఉండే ‘క్యాప్‌నోసైటోఫాగా కానిమోర్సస్’ అనే బ్యాక్టీరియా, ఆమె శరీరంలోని చిన్న గాయం ద్వారా రక్తంలోకి ప్రవేశించిందని గుర్తించారు. ఈ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఆమెకు ఆరుసార్లు గుండెపోటు వచ్చింది. ప్రాణాలు కాపాడే క్రమంలో వైద్యులు ఆమె రెండు కాళ్లు (మోకాళ్ల కింద), రెండు చేతులు తొలగించారు. ఆమె ప్లీహాన్ని కూడా తీసేయాల్సి వచ్చింది.

సుమారు 32 వారాల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన మంజిత్, ఇటీవల ఇంటికి తిరిగి వచ్చారు. పెంపుడు జంతువులతో ఆడుకునేటప్పుడు, వాటి లాలాజలం గాయాలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..

ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో రకాల విదేశీ ఆహార పదార్థాల కోసం వెతుకుతూ ఉంటాం. కానీ మన వంటగదిలోనే పోషకాల గని దాగి ఉందని చాలామందికి తెలియదు. అవే 'అవిసె గింజలు'. చూడటానికి చిన్నవిగా కనిపించినా, ఇవి చేసే మేలు మాత్రం అపారం. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్ లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ఒఎం) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.



మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.


# ఈ మ్యాజిక్ డ్రింక్ తాగితే 30 రోజుల్లో పొట్ట కొవ్వుకు చెక్



బరువు తగ్గాలి అంటే గంటల తరబడి జిమ్‌లో కష్టపడాలి లేదా కడుపు మాడ్చుకుని కఠినమైన డైట్ పాటించాలి అని చాలామంది భయపడుతుంటారు. అయితే కేవలం వ్యాయామం, తక్కువ ఆహారం తీసుకోవడం వల్ల మాత్రమే బరువు తగ్గడం సాధ్యం కాదని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను, విషతుల్యాలను ఎప్పటికప్పుడు బయటకు పంపడం కూడా అంతే ముఖ్యం. శరీరాన్ని లోపల నుంచి శుభ్రం చేయకపోతే మీరు ఎంత కష్టపడినా వెయిట్ లాస్ అనేది చాలా నెమ్మదిగా జరుగుతుంది. ఇక్కడే మనకు 'డిటాక్స్ డ్రింక్' ఎంతో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో మెటబాలిజం (జీవక్రియ) పాత్ర చాలా కీలకం. ఈ డిటాక్స్ డ్రింక్ కోసం ఒక గ్లాస్ బాటిల్‌లో రెండు స్పూన్ల స్వచ్ఛమైన తేనె, అర నిమ్మకాయ రసం తీసుకోవాలి. తేనె మన శరీరానికి తక్షణ శక్తిని ఇస్తే, నిమ్మకాయలోని సి విటమిన్ కొవ్వును కరిగించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఈ రెండింటి కలయిక వల్ల శరీరంలోని మెటబాలిజం రేటు పెరుగుతుంది. అంటే మీరు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో కూడా క్యాలరీలు ఖర్చయ్యేలా ఈ పానీయం ప్రోత్సహిస్తుంది. ఈ డ్రింక్‌లో మరో ముఖ్యమైన పదార్థం 'చియా విత్తనాలు'. ముందుగా నానబెట్టిన ఒక స్పూన్ చియా విత్తనాలను ఈ పానీయంలో కలుపుకోవాలి. వీటిలో ఫైబర్ (పీచు పదార్థం) పుష్కలంగా ఉండటం వల్ల వీటిని తీసుకున్న తర్వాత పొట్ట నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన సమయంలో ఆకలి వేయదు, తద్వారా మీరు జంక్ ఫుడ్ లేదా అధిక క్యాలరీలు ఉన్న ఆహారం తీసుకోకుండా ఉంటారు. బరువు తగ్గాలనుకునే వారికి అతిగా తినడం తగ్గించడమే అతిపెద్ద సవాలు.. ఆ సవాలును చియా విత్తనాలు సులభంగా అధిగమిస్తాయి.


పైన చెప్పుకున్న పదార్థాలన్నింటినీ ఒక గ్లాస్ బాటిల్‌లో వేసుకుని, అందులో కొద్దిగా పుదీనా ఆకులు లేదా పుదీనా నీళ్లు పోసుకోవాలి. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ డ్రింక్‌ను తయారు చేసుకున్న వెంటనే తాగకూడదు. కనీసం ఒక గంట పాటు అలాగే ఉంచాలి. అప్పుడే అందులోని పోషకాలన్నీ నీటిలోకి చేరుతాయి. ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున ఈ డ్రింక్ తాగడం వల్ల ఫలితాలు ఇంకా వేగంగా ఉంటాయి. క్రమం తప్పకుండా 30 రోజుల పాటు ఈ డిటాక్స్ డ్రింక్ తీసుకుంటే మీ శరీరంలో స్పష్టమైన మార్పులను గమనించవచ్చు. ముఖ్యంగా పొట్ట భాగంలో పేరుకుపోయిన మొండి కొవ్వు కరగడం మొదలవుతుంది. ఆకలి మీ నియంత్రణలోకి వస్తుంది. శరీరం లోపల నుంచి శుభ్రపడటం వల్ల చర్మం కూడా కాంతివంతంగా మారుతుంది. అలసట తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఇలాంటి డిటాక్స్ డ్రింక్స్‌ను మీ జీవనశైలిలో భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన రీతిలో ఫిట్‌నెస్‌ను సాధించవచ్చు. అయితే దీనితో పాటు తగినంత నీరు తాగడం, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం కూడా ముఖ్యమే.

# చిన్న వయసులోనే పిల్లల్లో మానసిక సమస్యలు కారణం అదేనని అంటున్న నిపుణులు!



చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారి మానసిక, శారీరక అభివృద్ధి కుంటుపడుతుంది. కొంతమంది పిల్లలు ఈ మొబైల్ ఫోన్లకు ఎంతగా బానిసలయ్యారంటే తమ తల్లిదండ్రులతో కూడా సమయం గడపడం లేదు. వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కుంటే తీవ్ర స్థాయిలో కోపం, అసహనం, మానసిక ఒత్తిడిని ప్రదర్శిస్తుంటారు. మొబైల్ ఫోన్లు, టీవీలు పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి కాలంలో పిల్లలు బయట ఆడుకునే బదులు టీవీ చూస్తూ, ఫోన్లు వాడుతూ సమయం గడుపుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది.న్యూరో కేర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాలీ జైన్ గుప్తా మాట్లాడుతూ.. సాధారణంగానే నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలకు తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు అల్లరి చేయకుండా ప్రశాంతంగా ఉంచడానికి మొబైల్ ఫోన్లు, టీవీల ముందు కూర్చోబెడుతున్నారు. ఇది పిల్లల మానసిక సమతుల్యతను మరింత దిగజార్చుతుంది. అంతేకాకుండా వారి సామాజిక, శారీరక అభివృద్ధి కూడా కుంగిపోతుంది. ఆటలు, క్రీడలు వంటి సహజ కార్యకలాపాలు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు తమకు తాముగా కఠినమైన పరిమితులను ఏర్పరచుకోవడం వంటి కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని అన్నారు. 2 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వారికి వీడియో కాల్స్ చేయడానికి కూడా అనుమతించకూడదు. ఈ వయస్సులో స్క్రీన్ వాడకంవల్ల మెదడు అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు స్క్రీన్ సమయం చాలా పరిమితం చేయాలి. చదవడానికి ఉపయోగించినప్పటికీ రోజుకు 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఇవ్వకూడదు. వారిని ఆన్‌లైన్ గేమ్స్, వీడియోలు, రీల్స్‌కు దూరంగా ఉంచాలి. వీటన్నిటితో పాటు మొబైల్ ఫోన్లు ఉపయోగించే సమయాన్ని పరిమితం చేయాలి.

## ఫిట్‌నెస్ అంటే ప్రాణమా..! బాడీ డీహైడ్రేట్ కాకుండా చేసే మ్యాజిక్



ఆరోగ్యకరమైన జీవనశైలిలో వ్యాయామం ఎంత ముఖ్యమో, దానికి తగిన పోషకాహారం అందించడం కూడా అంతే ముఖ్యం. చాలా మంది ఉదయాన్నే నిద్రలేవగానే ఏమీ తినకుండానే జిమ్‌కు లేదా రన్నింగ్‌కు వెళ్తుంటారు. ఖాళీ కడుపుతో వర్కవుట్ చేయడం వల్ల శరీరం త్వరగా అలసిపోవడమే కాకుండా, కండరాల పటుత్వం కూడా దెబ్బతినే అవకాశం ఉంది.కానీ వ్యాయామానికి ఒక 30 నుంచి 45 నిమిషాల ముందు ఏదైనా ఒక పండు తింటే మీ శరీరానికి అందే శక్తి అద్భుతంగా ఉంటుంది. పండ్లలో ఉండే సహజ చక్కెరలు శరీరానికి తక్షణ ఇంధనాన్ని అందిస్తాయి. పండ్లలో గ్లూకోజ్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. ఇవి రక్తంలోకి త్వరగా చేరి మెదడుకు, కండరాలకు తక్షణ శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అరటిపండు వంటి పండ్లు కార్బోహైడ్రేట్లకు నిలయాలు. ఇవి వ్యాయామం పూర్తయ్యే వరకు మీ శక్తి స్థాయిలను పడిపోకుండా స్థిరంగా ఉంచుతాయి. దీనివల్ల మధ్యలోనే నీరసం రాకుండా రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. బరువైన ఆహారం తిని వ్యాయామం చేయడం వల్ల కడుపులో అసౌకర్యం కలుగుతుంది. కానీ పండ్లు చాలా తేలికగా ఉండి, త్వరగా జీర్ణమవుతాయి. వీటిలోని ఫైబర్ నెమ్మదిగా శక్తిని విడుదల చేయడానికి సహాయపడుతుంది. దీనివల్ల వర్కవుట్ మధ్యలో ఆకలి వేయకుండా ఉండటమే కాకుండా, శరీరం చాలా తేలికగా అనిపిస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు చెమట ద్వారా పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలను మన శరీరం కోల్పోతుంది. అరటిపండ్లు, నారింజ వంటి పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. ఇది కండరాలు పట్టేయకుండా కాపాడుతుంది. అంతే కాకుండా గుండె స్పందనను క్రమబద్ధీకరించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.బెర్రీలు, యాపిల్స్, ద్రాక్ష వంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వ్యాయామం చేసేటప్పుడు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. పండ్లలోని పోషకాలు కణాల నష్టాన్ని నివారించి, కండరాలు త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి. వ్యాయామం తర్వాత వచ్చే నొప్పులను తగ్గించడంలో ఇవి ఎంతో సహాయపడతాయి. పుచ్చకాయ, నారింజ, స్ట్రాబెర్రీ వంటి పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. ఉదయాన్నే వర్కవుట్ చేసేటప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఇవి కాపాడతాయి. శరీరానికి అవసరమైన తేమను అందిస్తూనే వర్కవుట్ ఎఫెక్టివ్‌గా జరిగేలా చూస్తాయి. అరటిపండు బెస్ట్ ప్రీ-వర్కవుట్ ఫుడ్. ఇందులోని పొటాషియం కండరాల పని తీరును మెరుగుపరుస్తుంది. యాపిల్ లోని పీచు పదార్థం, సహజ చక్కెరలు రోజంతా స్థిరమైన శక్తిని ఇస్తాయి. నారింజ విటమిన్ సి, నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

## జుట్టు ఆరోగ్యంపై పెరుగుతున్న ఆందోళన..




ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో కాలుష్యం, మారిన జీవనశైలి కారణంగా చాలామంది జుట్టు రాలడం మరియు చుండ్రు వంటి తీవ్రమైన సమస్యలతో సతమతమవుతున్నారు.

వాతావరణంలోని దుమ్ము, ధూళి వల్ల స్కాల్ప్ ఇన్ఫెక్షన్లకు గురై జుట్టు బలహీనపడటం మనం గమనిస్తూనే ఉన్నాం. మానసిక ఒత్తిడి కూడా జుట్టు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిని అశ్రద్ధ చేస్తే జుట్టు ప్యాచుల్లా ఊడిపోయే ప్రమాదం ఉందని వారు విశ్లేషిస్తున్నారు.ఈ సమస్యల నుండి బయటపడటానికి వారానికి ఒకసారి తలకి నూనెతో మసాజ్ చేసుకోవడం ఒక అద్భుతమైన మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడి, జుట్టు కుదుళ్లకు కావాల్సిన పోషకాలు అందుతాయి. ఇది కుదుళ్లను దృఢంగా మార్చడమే కాకుండా, చర్మం పొలుసులుగా ఊడిపోవడం మరియు పొడిబారడం వంటి సమస్యలను సమర్థవంతంగా నివారిస్తుంది. తద్వారా జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుంది.మరోవైపు, కేవలం మనుషులకే కాకుండా పంటలకు కూడా తెగుళ్ల బెడద తీవ్రంగా ఉంది. ముఖ్యంగా మిరప, టమాటా, క్యాబేజీ వంటి వాణిజ్య పంటలు ఎండుతెగులు బారిన పడి రైతులు నష్టపోతున్నారు. ఈ తెగులు సోకినప్పుడు మొక్కలు అకస్మాత్తుగా వాడిపోయి ఎండిపోతుంటాయి. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉన్నందున, రైతులు ప్రాథమిక దశలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరమని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

పంటల్లో ఎండుతెగులు నివారణకు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల మెటాలాక్సిల్ + మాంకోజెబ్ మిశ్రమాన్ని కలిపి మొక్కల మొదళ్ల వద్ద పోయడం ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చు. ఇలా తగిన సమయంలో రసాయన మందులను సరైన మోతాదులో వినియోగిస్తే పంటను కాపాడుకోవచ్చని వారు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు

## తలలో పేలు పోవడం లేదా!



ఈ రోజుల్లో ఎంతో మంది అమ్మాయిలకు తలలో పేలు భారంగా మారుతున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే తలలో ఉండే రక్తం మొత్తం పీల్చేస్తాయి. కాబట్టి, పేలు పడిన వెంటనే వాటిని వదిలించుకోవాలి. దీనికోసం కొందరు మెడిసిన్ వాడుతుంటారు. వాటికన్నా సహజంగా వీటిని వాడి పేలకు చెక్ పెట్టండి. ఒక్కోసారి ఎన్ని మందులు వాడినా కూడా ప్రయోజనం ఉండదు. అలాంటి వారు ఈ నేచురల్ టిప్స్ తో మీ తలలోని పేలను శాశ్వతంగా తరిమికొట్టండి.వేప నూనె: మీరు రోజూ వాడే కొబ్బరి నూనెలో పది చుక్కలు వేప నూనె వేసి తలకు బాగా పట్టించి 1 గంట తర్వాత తలస్నానం చేయండి. ఇలా చేస్తే పేలు మొత్తం వదులుతాయి. వారానికొకసారి ఇలా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.వెల్లుల్లి పేస్ట్ : వంట గదిలో ఉండే ఐదు వెల్లుల్లి రెబ్బలను తీసుకుని వాటిని పేస్ట్ లాగా చేసుకుని దీనిలో కొద్దిగా నిమ్మరసం కలిపి తలకు పట్టించి 1 గంట తర్వాత తలస్నానం చేయండి. ఇలా చేస్తే పేలు మొత్తం పోతాయి.నిమ్మ రసం: పేలు బాగా ఉన్నప్పుడు నిమ్మ రసాన్ని తలకు పట్టించి,40 నిమిషాలు ఉంచుకుని ఆ తర్వాత తలస్నానం చేస్తే పేలు మొత్తం పోతాయి. నెలలో మూడు సార్లు నిమ్మరసాన్ని పెట్టుకుంటే మంచి ఫలితం ఉంటుంది. పేలకు పోగొట్టడానికి హాస్పిటల్స్ చుట్టూ తిరిగే బదులు పైన చెప్పిన సహజ చిట్కాలను పాటించి పేల సమస్యకు చెక్ పెట్టండి.

# ధోని రిటైర్మెంట్ ఊహాగానాలకు బ్రేక్..
# సీఎస్‌కే సీఈఓ బిగ్ అప్‌డేట్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ చేస్తారనే ఊహాగానాలకు బ్రేక్ పడింది. మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమైతున్నట్లు తెలుస్తుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కూడా ధోనీ ఆడబోతున్నారని చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సీఈఓ కాశీ విశ్వనాథన్ ధృవీకరించారు. కాగా ధోనీ నాయకత్వంలో చెన్నై సూపర్ కింగ్స్ ఐదు సార్లు ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకుంది. ఐపీఎల్ కెరీర్‌లో అతడు మొత్తం 235 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించగా, 136 విజయాలు సాధించారు. ధోని కెప్టెన్సీ విజయం శాతం 57.87గా ఉంది. ఐపీఎల్ ఆరంభం నుంచే చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్న ధోనీ, ఫ్రాంచైజీకి ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన కెప్టెన్‌గా చరిత్ర సృష్టించారు. ఈ ఐదు ట్రోఫీలు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికం కావడం విశేషం. ఐపీఎల్ 2024 సీజన్‌కు ముందు ధోనీ కెప్టెన్సీ బాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించినప్పటికీ, ఆటగాడిగా మాత్రం జట్టుతోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు 2026 సీజన్‌లోనూ అతని అనుభవం సీఎస్‌కేకు కీలకంగా మారనుంది. అబుదాబిలో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో సీఎస్‌కే మొత్తం 9 మంది ఆటగాళ్లను కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే కీలక మార్పులు చేసింది. సంజూ శాంసన్‌ను రూ.18 కోట్ల జట్టులోకి తీసుకుంది. అదే సమయంలో రవీంద్ర జడేజా (రూ.14 కోట్లు), సామ్ కరన్ (రూ.2.4 కోట్లు) ట్రేడ్ ద్వారా రాజస్థాన్ రాయల్స్‌కు వెళ్లారు. రాహుల్ చాహర్, అకీల్ హోసైన్, మ్యాట్ హెన్రీ, మ్యాథ్యూ షార్ట్,
సర్ఫరాజ్ ఖాన్ లాంటి అనుభవజ్ఞులతో పాటు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కార్తిక్ శర్మ, ప్రశాంత్ వీర్‌లపై ఒక్కొక్కరికి రూ.14.2 కోట్లతో కొనుగోలు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 26వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. ధోనీ మరోసారి మైదానంలోకి దిగనుండటంతో, సీఎస్‌కే అభిమానుల్లో ఉత్సాహం మరోసారి పీక్స్‌కు చేరింది.

# సౌతాఫ్రికాతో మ్యాచ్‌కి భారత జట్టులో ఒకే ఒక్క మార్పు..



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 సూపర్–8 దశలో భాగంగా దక్షిణాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌కు ముందు భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్‌లో కీలక మార్పు చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ మ్యాచ్ ఇరు జట్లకు సూపర్–8లో తొలి పోరు. 2024లో జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌లో తలపడిన ఈ రెండు జట్లు ఇప్పుడు మరోసారి పోటీ పడుతున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ని మళ్లీ తుది జట్టులోకి తీసుకురావాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తుంది. అలా జరిగితే వాషింగ్టన్ సుందర్ ఈ మ్యాచ్‌కు బెంచ్‌కే పరిమితం కానున్నాడు. నెదర్లాండ్స్‌తో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్‌కు విశ్రాంతి తీసుకున్న అక్షర్, ఇప్పుడు సూపర్–8లో తిరిగి టీంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నాడు.
అక్షర్ ఈ వరల్డ్ కప్‌లో అద్భుతంగా బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. కేవలం 3 మ్యాచ్‌ల్లోనే 6 వికెట్లు తీసి, 6.63 ఎకానమీతో భారత్ తరఫున రెండో అత్యధిక వికెట్లు తీయగా.. బంతితో పాటు బ్యాట్‌తో కూడా కీలక పాత్ర పోషించగలగడంతో జట్టుకు విలువైన ఆటగాడిగా మారాడు. ఇక యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడుసార్లు డకౌట్లు అయినప్పటికీ, అతడ్ని తుది జట్లులోకి తీసుకునే అవకాశం కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రీ–మ్యాచ్ ప్రెస్‌మీట్‌లో సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ మ్యాచ్ అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనుండటంతో, భారత్ 4 పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం కనిపిస్తుంది. దీంతో కుల్దీప్ యాదవ్ మరోసారి తుది జట్టులో చోటు కోల్పోయే ప్రమాదం ఉంది. జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ తో పాటు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే బౌలింగ్ బాధ్యతలు పంచుకుంటారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషించనున్నారు.

**భారత్ ప్లేయింగ్ ఎలెవన్:**
అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్‌కీపర్), తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా.

# చెలరేగిన లంక బౌలర్లు.. తక్కువ స్కోరుకే ఇంగ్లాండ్ పరిమితం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ సూపర్–8 దశలో జరుగుతున్న మ్యాచ్ లో ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. పల్లెకెలె మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో శ్రీలంక కెప్టెన్ దసున్ షనక టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ తీసుకున్నాడు. దీంతో ఇంగ్లాండ్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. తొలి రెండు ఓవర్లలో భారీ షాట్స్ ఆడిన ఇంగ్లాండ్ ఓపెనర్లు మూడో ఓవర్లో జోస్ బట్లర్ (7) నాదీజౌగా దునిత్ వెల్లాలేజ్ బౌలింగ్ లో అవుట్ అయ్యాడు.
అనంతరం క్రీజులోకి వచ్చిన జాకబ్ బెథెల్ (3) సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. మహేష్ తీక్షణ వేసిన బౌలింగ్ లో బెథెల్ ఆడిన బాల్ టాప్ ఎడ్జిలో తగిలి థర్డ్–మ్యాన్ లో ఉన్న మధుశంక అద్భుతమైన డైవింగ్ క్యాచ్‌ను అందుకున్నాడు. దీంతో ఇంగ్లాండ్ తీవ్ర కష్టాల్లో పడింది. బ్యాటింగ్ కి వచ్చిన టామ్ బాంటన్ (6) రన్ ఔట్, అనంతరం ఇంగ్లీష్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ (14) అవుట్ కావడంతో కీలకమైన వికెట్లను బ్రూక్ సేన కోల్పోయింది. ఒకవైపు, ఇంగ్లాండ్ జట్టు వరుసగా వికెట్లను కోల్పోతున్నా, ఓపెనర్ ఫిల్ సాల్ట్ (62) మాత్రం హాఫ్ సెంచరీతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. సామ్ కరన్ (11), లియామ్ డాసన్ (6), జోఫ్రా ఆర్చర్ (0) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయారు. చివర్లో విల్ జాక్స్ మాత్రం కాసేపు శ్రీలంక బౌలర్లపై ఎదురు దాడి చేసే ప్రయత్నం చేయగా.. దిల్షన్ మధుశంక బౌలింగ్ భారీ షాట్ ఆడబోయిన జాక్స్ దునిత్ వెల్లలాగేకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. లాస్ట్ ఓవర్లో జేమీ ఓవర్టన్ (10లి) ఒక సిక్సు కొట్టడంతో ఇంగ్లాండ్ 9 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. మరోవైపు, శ్రీలంక బౌలర్ల ధాటికి ఇంగ్లాండ్ బౌలర్ల క్రీజుల నిలవలేకపోయారు. దునిత్ వెల్లలగే 3 వికెట్లు తీసుకుని ఇంగ్లీష్ జట్టు పతనాన్ని శాసించగా, దిల్షన్ మదుశంక, మహేశ్ తీక్షణ చెరో రెండు వికెట్లు పడగొట్టగా, దుష్మంత చమీర ఒక వికెట్ తీసుకున్నాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో ఇంగ్లాండ్ 146/9 పరుగులు చేసింది.

# మొత్తానికి ఫేవరెట్ స్టార్ తో జాన్వీకపూర్!

ఎంత పెద్ద హీరోయిన్ అయినా అభిమాన హీరో అంటూ ఒకరుంటారు. నటిగా కెరీర్ ముగిసే లోపు ఒక్క సారైనా ఆ స్టార్ సరసన నటించాలని కోరుకుంటారు. కానీ అలా అందరి హీరోయిన్ల విషయంలో జరగదు. ఎంత ట్యాలెంట్ ఉన్నా? అదృష్టం కూడా కలిసొస్తేనే ఛాన్స్ అందుకోగలరు. పవన్ కళ్యాణ్ సరసన అనుష్క నటించాలని ఎంతో కాలంగా అనుకుంటోంది. కానీ ఆ కాంబినేషన్ ఇంత వరకూ సెట్ కాలేదు. ఏ దర్శకుడు కూడా వాళ్లిద్దర్నీ కలిపే ప్రయత్నం కూడా చేయలేదు. అలాగని పవన్ ఇమేజ్ కు సరితూగని హీరోయిన్ అంటే? అదీ కాదు అనుష్కను అభిమానించే తెలుగు వారు ఎంతో మంది ఉన్నారు.మరెందుకు నటించలేదంటే కాలం కలిసి రాకనే చెప్పాలి. ఆ సంగతి పక్కన బెడితే? జాన్వీ కపూర్ అభిమాన స్టార్ ఎవరు? అంటే రణబీర్ కపూర్ అని అందిరికీ తెలుసు. మరి అతడితో జాన్వీ సినిమా చేసిందా? అంటే ఇంత వరకూ సాధ్యపడలేదు. చాలా కాలంగా రణబీర్ కపూర్ సరసన నటించాలని జాన్వీ భావిస్తోంది. ఓపెన్ గానే ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పింది. కానీ బాలీవుడ్ మేకర్స్ ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా ఆమె ఆసక్తిని మోహిత్ సూరి గమనించాడో? ఏమోగానీ ఆ ఛాన్స్ తానే ఇస్తానంటూ ముందుకొచ్చాడు.

రణబీర్ కపూర్ హీరోగా ఓ గ్యాంగ్ స్టార్ మ్యూజికల్ లవ్ స్టోరీని తెరకెక్కించడానికి రెడీ అవుతున్నారు. వాస్తవానికి మోహిత్ సూరి కూడా చాలా కాలంగా రణబీర్ తో సినిమా చేయాలనుకుంటున్నాడు. కానీ రణబీర్ వేర్వేరు సినిమాలతో బిజీగా ఉండటంతో సాధ్యపడలేదు. ఇంతకాలానికి ఆ కాంబినేషన్ సెట్ అయింది. ఇందులో హీరోయిన్ గా ఎవర్ని తీసుకోవాలి? అనే చర్చ మోహిత్ టీమ్ లో జరగగా..ఆయన మరో ఆలోచన లేకుండా జాన్వీ కపూర్ ను ఫిక్స్ చేసారట. జాన్వీ కపూర్ ఆసక్తిని గమనించే మోహిత్ ఈ ఛాన్స్ కల్పించినట్లు వెలుగులోకి వస్తోంది.
తాను ఎవరో నటిని తీసుకోవడం కంటే? అభిమాన హీరోకి జోడీగా తననే తీసుకుంటే? కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుంది. చాలా సన్నివేశాల విషయంలో రాజీ పడాల్సిన పని ఉండదు. పైగా మోహిత్ సినిమాల్లో రొమాంటిక్ సన్నివేశాల్లో ఘాడత కూడా ఎక్కువగానే ఉంటుంది. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాలకు సైతం నో చెప్పడానికి ఛాన్స్ ఉండదు. సెట్స్ కు వెళ్లిన తర్వాత ఏ నటి అయినా దర్శకుల హీరోయిన్ గా పనిచేయాల్సిందే. అందుకు జాన్వీ కపూర్ ఎప్పుడూ సిద్దంగానే ఉంటుంది. ప్రస్తుతం అమ్మడు తెలుగులో 'పెద్ది' లో రామ్ చరణ్ కు జోడీగా నటిస్తోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ లో మాత్రం మోహిత్ సూరి ప్రాజెక్ట్ తప్ప ఇంకే సినిమాకు కమిట్ అవ్వలేదు. మోహిత్ సూరి పిలిచి ఇస్తోన్న అవకాశం కాబట్టి జాన్వీ ఆనందంతో ఉబ్బితబ్బితోంది.





లేత-రంగు చీరలో ప్రియా భవాని శంకర్ స్టన్స్



ఐశ్వర్య మీనన్ యొక్క బ్రీజీ సీసైడ్ అవుట్‌ఫిట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965